ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 19, జూలై 2025





సహకార శాఖలో జీతాలకు లైన్‌క్లియర్

డీసీవోగా ఇందిరాదేవికి పూర్తి అదనపు బాధ్యతలు



- ఎట్టకేలకు ఉన్నతాధికారుల ఉత్తర్వులు
- మంత్రి డాక్టర్ స్వామి చొరవ, లోకేష్ ఆదేశాలతో వ్యవహారం కొలిక్కి
- తొలి నుంచి ఉన్నతాధికారుల తీరుపై ఆరోపణలే

ఒంగోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకారశాఖలో నాలుగు నెలలుగా నెలకొన్న గందరగోళ పరిస్థితికి తాత్కాలికంగా తెరపడింది. ఆ శాఖ జిల్లా కార్యాలయ ఉద్యోగులకు మూడు మాసాలుగా నిలిచిపోయిన జీతాల చెల్లింపునకు మార్గం సుగమమైంది. అందుకు వీలుగా ఇన్‌చార్జి డీసీవోగా ఉన్న ఇందిరాదేవికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఆ శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి చొరవ చూపి ఉద్యోగుల జీతాలు ఆగిపోయిన విషయాన్ని పార్టీ కీలక నేత అయిన మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తగు ఆదేశాలు ఇవ్వడంతో రెండు రోజుల్లో ఉన్నతాధికారులు లోటుపాట్లు సరిచేసుకొని ఇందిరాదేవికి పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)తో డీసీవోగా ఉత్తర్వులు జారీచేశారు.

తొలి నుంచి వివాదాస్పదమే

జిల్లాలో సహకార శాఖను గాడిలో పెట్టాల్సిన రాష్ట్ర ఉన్నతాధికారులు తొలి నుంచి అందుకు విరుద్ధంగానే వ్యవహరిస్తూ వచ్చారన్న విమర్శలు, ఆరోపణలు అధికారపార్టీ పెద్దల నుంచి ఉన్నాయి. డీసీసీబీపై విచారణ విషయంలోనూ, పలు కీలక సహకార సంస్థల పాలకవర్గాల నియామకాలు, ఇతర అంశాల్లోనూ జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సూచనలకు భిన్నంగా జిల్లా అధికారులు వ్యవహరించారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల మద్దతుతోనే వారు అలా చేశారన్న ఆరోపణలు బలంగా వచ్చాయి. ఆ క్రమంలో ఇక్కడి డీసీవోగా గతంలో ఉన్న శ్రీనివాసరెడ్డి తీరుపై అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం, అదే సమయంలో పాలనా వ్యవహారాల్లో ఆయన తీరుపట్ల కలెక్టర్ అసంతృప్తిగా ఉన్న నేపథ్యంలో గత మార్చిలో శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అలాంటి సమయంలో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు తమ అభీష్టానికి విరుద్ధంగా సరెండర్ జరిగిందన్న

మిగతా 6వ పేజీలో

సాగుకు ఊతం

జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం

పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి వద్ద పొలాల్లోకి చేరిన వర్షపు నీరు


ఎన్‌జీపాడు మండలం కొత్తకోట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. గురువారం రాత్రి జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. సాగులో ఉన్న పంటలకు ప్రాణం పోసింది. దాదాపు నెలన్నరగా చినుకు జాడలేక తీవ్రమైన ఎండలతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి ఉపశమనం లభించింది. దుక్కులు దున్ని విత్తనం వేసేందుకు భూమిలో తేమలేక ఎదురుచూస్తున్న రైతులకు తాజా వర్షం మేలు చేసింది. జిల్లాలో శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 34.7మి.మీ వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో ఒక మోస్తరుగా పడింది. పశ్చిమప్రాంతంలో మాత్రం భారీగా కురిసింది. ఒంగోలు పరిసర ప్రాంతంలోనూ మంచి వర్షమే పడింది.

- సగటున 34.7 మి.మీ నమోదు
- పశ్చిమాన భారీగానే కురిసిన వాన
- పలుచోట్ల పొలాల్లోకి చేరిన నీరు
- అక్కడక్కడా పొంగిపొర్లిన వాగులు
- ఎండల నుంచి ఉపశమనం
- ఒక్కసారిగా తగ్గిన ఉష్ణోగ్రతలు

ఒంగోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి వర్షం కురిసింది. తూర్పుప్రాంతంలో ఓ మోస్తరుగా, పశ్చిమప్రాంతంలో భారీగా పడింది. గరిష్ఠంగా ఎర్రగొండపాలెం మండలంలో 122.40 మి.మీ వర్షపాతం నమోదైంది. టంగుటూరులో 88.0, కొత్తపట్నంలో 77.4, మద్దిపాడులో 70.20, జరుగుమల్లిలో 68.40, తాళ్లూరులో 58.80, దర్శిలో 54.6, సంతనూతలపాడులో 52.6 మి.మీ కురిసింది. పుల్లలచెరువు, తర్లుపాడు, బేస్తవారపేట, రాచర్ల, దొనకొండ,

మిగతా 6వ పేజీలో

పంటలకు ప్రాణం

జిల్లాలో ప్రస్తుత సమయం ముమ్మర ఖరీఫ్ సీజన్ కాగా నెలన్నరగా సరైన వర్షం లేక పంటలు సాగు ముందుకు సాగలేదు. జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు లక్షా 29వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి. అందులోనూ ఈ సమయానికి కనీసం 50వేల నుంచి 60వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. తొలకరి పైర్లు అయిన నువ్వు, సజ్జ, ఇతర పశుగ్రాస పచ్చిరొట్ట ఎరువుల పైర్లు నెలక్రితమే వేసి బాగా ఎదుగుదల దశకు చేరతాయి. అలాగే ప్రధాన ఖరీఫ్ పంటలైన కంది, పత్తి, మిర్చి, ఇతరత్రా సాగు ముమ్మరంగా ఉండాలి. అయితే జూన్‌లో 35శాతం, ఈనెలలో 17వతేదీ వరకు 55శాతానికిపైగా లోటు వర్షపాతంతో సాగు ముందుకు సాగలేదు. కేవలం పదిన్నర వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అందులో పత్తి 40శాతం కాగా మిగిలిన ప్రధాన పంటలు అతి తక్కువగా ఉన్నాయి. తీవ్ర వర్షాభావంతో ఆ పంటలు కూడా వాడుముఖం పట్టాయి. ఈ సమయంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం సాగుకు ఊతం ఇచ్చింది.

సైలెన్సర్‌లను ధ్వంసం చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



ఫట్ ఫట్

- మాడిఫైడ్ సైలెన్సర్లను రోలర్‌తో ధ్వంసం చేసిన పోలీసులు
- ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరిక

7



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, వేదికపై ఎస్ఈ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

ఎస్సీ, ఎస్టీలకు 30వేల ఉచిత సోలార్ కనెక్షన్లు

- వ్యవసాయ కనెక్షన్లకు 1,700 ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి వెల్లడి
- ఆర్డీఎస్ఎస్ పనులపై అధికారులతో సమీక్ష

ఒంగోలు క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఆర్డీఎస్ఎస్ పనులు, పీఎం సూర్యఘర్ పురోగతి, వ్యవసాయ కనెక్షన్లు తదితర అంశాలపై ఆయన అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. తద్వారా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. వ్యవసాయ కనెక్షన్లు 1,700 పెండింగ్‌లో ఉన్నాయని వాటికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్, ఇతర సామగ్రి అందజేస్తామని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ (సోలార్ రూఫ్‌టాప్) కింద జిల్లాలో 30వేల కనెక్షన్లు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకున్నదని వెల్లడించారు. ప్రస్తుతం 2వేల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకున్నారని, నెలకు 300 ఏర్పాటు లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు బ్రేక్ డౌన్ కావడంతో సరఫరాకు అంతరాయం వస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. అలాంటి అంతరాయాలు లేకుండా నెలకు ప్రతి డివిజన్‌లో 33 కేవీ లైన్, ప్రతి సెక్షన్‌లో రెండు 11 కేవీ లైన్లు తనిఖీలు చేసి కారణాలను గుర్తించి పునరుద్ధరించే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. విద్యుత్ బకాయిల వసూలు జిల్లాలో వేగవంతంగా ఉండటంపై సిబ్బందిని అభినందించారు. అదేవిధంగా విద్యుత్ లైన్లపై నిరంతరం పెట్రోలింగ్ చేసి లోపాలను గుర్తించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. స్మార్ట్‌మీటర్లపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి హాంఫట్


కలుజువ్వలపాడులో వైసీపీ నేత ఆక్రమించి అమ్మిన ప్రభుత్వ భూమి

- ఆక్రమించి విక్రయించిన వైసీపీ నేత
- భారీగా సొమ్ము చేసుకున్న వైనం
- చదునుచేసి రాళ్లు పాతేందుకు కొనుగోలుదారుడి యత్నం
- నిలదీసిన గ్రామస్థులకు బెదిరింపులు

తర్లుపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడులో యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారు. ఈ భూములు కర్నూలు, ఒంగోలు జాతీయ రహదారి పక్కన ఉండటంతో ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరా దాదాపు రూ.కోటి పలుకుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కలుజువ్వలపాడులో జాతీయ రహదారి పక్కన మార్కాపురం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త, వైసీపీ నాయకుడికి సర్వే నెం.129-12లో ఎకరా 88 సెంట్లు, 132-1లో 4 ఎకరాల 31సెంట్ల భూమి ఉంది. వాటి మధ్యన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడు. సర్వే నెం.132-3లో 2 ఎకరాలు, 129-11లో 52 సెంట్ల భూమిలో పాగా వేశాడు. ప్రస్తుతం

మిగతా 6వ పేజీలో

సౌకర్యాలు సరే.. వైద్యులేరీ..?

- త్రిశంకుస్వర్గంలో మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి
- బదిలీపై వెళ్లిపోయిన మెడికల్ కాలేజీ సిబ్బంది

6లో


బేస్తవారపేట - ఒంగోలు రోడ్డుపై బర్లీ పొగాకును తగులబెడుతున్న రైతులు

భగ్గుమన్న బర్లీ రైతు

నడిరోడ్డుపై బేళ్లు తగులబెట్టి నిరసన

బేస్తవారపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతులు ప్రభుత్వంపై కన్నెర్ర చేశారు. తాము పండించిన పంటను కొనే నాథుడు లేడని, ఇంత వరకు న్యాయం జరగలేదని ఆగ్రహిస్తూ మండలంలోని సలకలవీడుకు చెందిన రైతులు బేస్తవారపేట-ఒంగోలు రోడ్డులో శుక్రవారం బేళ్లను తగులబెట్టారు. గ్రామంలో 30 మంది 100 ఎకరాల్లో బర్లీ సాగు చేశామని ఈ సందర్భంగా వారు తెలిపారు. వెంటనే తమ వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

చిల్లచెట్ల మధ్య శిథిలావస్థలో ఉన్న పాలశీతల కేంద్రం



కనిగిరి డెయిరీపై కన్ను

ఐదు ఎకరాల భూమిని కొట్టేసేందుకు కొందరు ప్రయత్నం

- శిథిలావస్థలో భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రాంగణం

ఒకప్పుడు కళకళలాడిన కనిగిరి డెయిరీ నేడు ఆదరణ కోల్పోయి శిథిలావస్థకు చేరుకొంది. ప్రాంగణమంతా దట్టంగా చిల్లచెట్లు కమ్ముకున్నాయి. భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇదే అదునుగా కొందరు రూ.50కోట్ల విలువచేసే ఐదు ఎకరాల డెయిరీ స్థలంపై కన్నేశారు. దాన్ని కొట్టేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు

కనిగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం కనిగిరి పాలశీతల కేంద్రం పరిధిలోని ఆరు మండలాల్లో 140 వరకు పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. రెండు లక్షల మంది పాడి రైతులు పాలను డెయిరీకి సరఫరాచేసి ఆర్థికంగా ఎదిగారు. తర్వాత ప్రభుత్వాల విధానాల కారణంగా పాల ఉత్పత్తిదారులకు చెల్లింపుల్లో జాప్యం జరిగి బకాయిలు పెరిగిపోయాయి. ఈ కారణంతో రైతులు ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించడం ప్రారంభించారు. దీంతో పాలసేకరణ గణనీయంగా పడిపోయి డెయిరీ పరిస్థితి దిగజారిపోయింది. డెయిరీ పూర్తిగా ఆగిపోవడంతో పాల ఉత్పతిదారులను ప్రైవేటు డెయిరీలు దోచుకోవడం ప్రారంభించాయి.

పదేళ్లకు పైగా పాలకేంద్రం నిర్వహణలేక లోపల ఉన్న మిషనరీ అంతా తుప్పుపట్టి పోయింది. కేంద్రంలో శీతల ఉత్పన్నం (కూలింగ్) చేసే మిషనరీ పనికి రాకుండాపోయింది. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదంగా ఉన్న

మిగతా 6వ పేజీలో

రూ.50కోట్ల విలువైన భూమిని కారుచౌకగా కొట్టేసే ప్రయత్నం

దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డెయిరీ స్థలం విలువ నేడు రూ.50 కోట్లకు పైమాటే. దీంతో ఆ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. ఇప్పటికే డెయిరీలో ఉన్న రూ.20 లక్షలకు పైగా విలువైన యంత్ర సామగ్రి దొంగల పాలైంది. ఎలాంటి ఆదరణ లేకపోవడంతో కొంతమంది బడాబాబుల అండతో అక్రమార్కులు డెయిరీ స్థలం కొట్టేసేందుకు పథక రచన చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ రేటును నిర్ణయించి అతి చౌకగా 5ఎకరాల స్థలం కొట్టేసేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. డెయిరీ వెనుక వైపు నుంచి ఆక్రమించేందుకు పన్నాగం పన్నుతున్నారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డెయిరీ స్థలాన్ని అక్రమార్కుల చెర నుంచి కాపాడి ప్రజావసరాలకు అనుగుణంగా వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

రేషన్ తీసుకుంది 86.55 శాతం

- కార్డుదారులకు ముగిసిన పంపిణీ ప్రక్రియ
- ఒంగోలు మండలంలో అత్యధికంగా 93.23శాతం నమోదు

7

గ్రానైట్, కంకర రవాణా వాహనాల ఓనర్ల సమ్మె

చీమకుర్తి, జూలై18(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ ముడిబ్లాకులు, కంకర రవాణా చేసే ట్రక్ వాహనాల ఓనర్లు సమ్మెకు దిగారు. దీంతో కంకర, గ్రానైట్ రవాణాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఓవర్‌లోడ్ నిబంధనలు తూచా తప్పకుండా అధికారులు అమలు చేస్తుండటంతో దిక్కుతోచన స్థితిలో రవాణాను నిలిపివేసినట్లు తెలుస్తున్నది. లోడింగ్ నిబంధనలకు మించి కొంచెం అటూ ఇటూగా ఉన్నా భారీ జరిమానాలు విధిస్తుండటం రవాణా వాహనాల ఓనర్లకు మింగుడుపడలేదు. నిబంధనలకు లోబడి రవాణా చేస్తే గిట్టుబాటుకాక పోతుండటంతో రవాణాని నిలిపివేశారు. కంకరమిల్లులు, క్వారీ ఓనర్లు రవాణా చేసినందుకు ఇచ్చే కిరాయి రేట్లు పెంచితే సమ్మె పరిష్కారం కానుంది. దీనికి సదరూ ఓనర్లు సిద్ధంగా లేకపోవటంతో పీటముడి పడింది. లేదంటే అధికారులు అయినా చూసి చూడనట్లు వ్యవహరించాల్సి ఉంది. నిబంధనల అమలులో అధికారులు పట్టుబట్టి ఉండటంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో వాహనాలను నిలిపివేసి ఏదో ఒకటి తేలకపోతుందా అన్న తీరులో ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ అంశాన్ని కొంతమంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవచూపి పరిష్కార మార్గం చూపుతారేమో అనే ఆశ కూడా సమ్మె చేస్తున్న ఓనర్లలో ఉంది.

నేటి నుంచి సూరవారిపల్లి కౌడు పీర్లపండుగ

కొమరోలు, జులై18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరవారిపల్లి గ్రామంలో శ్రీ రంతూ బాదుల్లా, ఖాశింస్వామి,పెద్దపీరయ్య స్వాముల కౌడు పీర్ల పండుగ మహోత్సవాలను ఈనెల 19 నుంచి 21వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19న శనివారం చిన్న సరిగేసు పీర్లను అలంకరించడం, రాత్రికి రంగస్వామి ఈవెంట్స్ ఒంగోలు వారిచే పాటకచేరి, 20న ఆదివారం పగలు సరిగేసు పీర్లను గ్రామోత్సవం, ఉదయం 4పండ్ల బండలాగుడు పోటీలు జరుగును, 21న సోమవారం పెద్దసరిగేసు, ఉదయం రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం బండ పందెము, సాయంత్రం శ్రీ నెమిలిగుండ్ల రంగస్వామి వారిచే గొప్ప కోలాట కార్యక్రమం, రాత్రి కి నెల్లూరువారిచే పాటకచేరి కార్యాక్రమం, పీర్లను విద్యుత్ దీపాలతో అలంకరించడం, 22న మంగళవారం స్వాముల స్నానమునకు వెళ్ళుటతో పలురకాల పందెలు నిర్వహించి బహుమతులు ఇవ్వనున్నారు.

ట్రంక్‌రోడ్ విస్తరణ ప్రక్రియ వేగవంతం

- 100 అడుగుల విస్తరణకు దుకాణదారులకు నోటీసులు
- అభ్యంతరాలకు వారం రోజుల గడువు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధి కోసం చేపట్టిన రహదారుల విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ట్రంక్‌రోడ్ విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం కానుండగా, అందుకు సంబంధించి శుక్రవారం వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మిరియాలపాలెం కీర్తి మెడికల్ షాప్ వద్ద నుంచి మస్తాన్ దర్గా వరకు 100 అడుగుల విస్తరణకు అధికారులు సిద్ధం అయ్యారు. భవిష్యత్‌లో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల విస్తరించనున్నారు. ట్రంక్‌రోడ్ విస్తరణపై అభ్యంతరం తెలియజేస్తూ కోర్టును ఆశ్రయించారు. అయితే దీనిపై కార్పొరేషన్ అధికారులు తమ వాదనను వినిపించగా, ప్రజా ప్రయోజనం దృష్ట్యా, మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ సబబే అని తీర్పు ఇచ్చింది. ఇదే సమయంలో వ్యాపారులు 90అడుగులు మాత్రమే విస్తరించాలని కోరారు. అయితే రాబోయే యాభై సంవత్సరాలకు అనుగుణంగా 100 అడుగులు విస్తరించేందుకు సిద్ధం అయినట్లు సమాచారం. త్వరలోనే ఆయా పనులు ప్రారంభించనుండగా, ముందస్తు సమాచారం కోసం అందించిన నోటీసులపై అభ్యంతరాలను వారం రోజుల్లో తెలియజేయాలని కోరారు. ట్రంక్‌రోడ్ విస్తరణకు వ్యాపారులు సహకరించాలని కోరారు. అలాగే మిరియాల పాలెం నుంచి మస్తాన్ దర్గా సెంటర్ వరకు 100 అడుగులు విస్తరించనుండగా, అక్కడ నుంచి కొత్తపట్నం బస్టాండ్ వరకు 80 అడుగులు రోడ్ విస్తరించనున్నారు. ఈ మేరకు రోడ్ విస్తరణ పనులను కార్పొరేషన్ అధికారులు వేగవంతం చేశారు.



ఒంగోలులోని ట్రంక్ రోడ్డు

సాగుకు ఊతం

(5వ పేజీ తరువాయి)

పెద్దారవీడు, చీమకుర్తి, కొండపి, మార్కాపురం, పొన్నలూరు, నాగులుప్పలపాడు తదితర మండలాల్లో 30 నుంచి 50 మి.మీ మేర నమోదైంది. తూర్పు ప్రాంతంలో నెలన్నర నుంచి జల్లులు లేకపోగా పశ్చిమాన వారం క్రితం ఒక మోస్తరు వర్షం కురిసింది. తాజా వర్షంతో పశ్చిమప్రాంతంలోని పలుచోట్ల పొలాల్లోకి నీరు చేరింది. అక్కడక్కడా వాగులు, చెరువుల్లో నీటి ప్రవాహం మొదలైంది. ప్రధానంగా పెద్దారవీడు మండలంలోని నల్లవాగులోకి వరద నీరు ఉధృతి పెరిగింది. రాచర్ల, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు తదితర మండలాల్లో వాగులు, వంకలు పొంగాయి. అదేప్రాంతంలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం కురిసిన వర్షం జిల్లా ప్రజలకు, ప్రత్యేకించి రైతాంగానికి అన్ని విధాలా మేలు చేయనుంది.

పదునెక్కిన భూములు

తాజా వర్షం ఇప్పటికే సాగులో ఉన్న పైర్లకు ఉపయోగంతోపాటు దుక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉంచిన భూములు బాగా పదునెక్కాయి. ఆ భూముల్లో ఈ వర్షంతో కంది, పత్తి, మిర్చి మొక్కజొన్న, మినుము వంటి పంటలను సాగు చేసే అవకాశం ఏర్పడింది. అలాగే వరి సాగుకు అవసరమైన చర్యలను కూడా రైతులు తీసుకోనున్నారు. మరోవైపు వర్షాలు లేక వేసవిని తలపిస్తూ జిల్లాలో మండుతున్న ఎండల నుంచి కూడా తాజా వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. దాదాపు పక్షంరోజులుగా జిల్లాలో నిత్యం 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుతోపాటు వేడిగాలులు, ఉక్కపోత వాతావరణం నెలకొని ప్రజానీకం తల్లడిల్లిపోయారు. సాయంత్రం ఆరేడు గంటల సమయంలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం మరింత ఇబ్బంది పెట్టింది. ఇలాంటి సమయంలో విస్తారంగా వర్షం పడటంతో శుక్రవారం పగటిపూట నాలుగైదు డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గాయి. జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండగా అత్యధిక ప్రాంతాలు 35 డిగ్రీల కన్నా తక్కువగానే నమోదైంది. చాలా ప్రాంతాల్లో పగటిపూట మబ్బులు కమ్మి ఉండటం ఉపశమనం కలిగించింది.

సహకార శాఖలో జీతాలకు లైన్‌క్లియర్

(5వ పేజీ తరువాయి)

భావనతో ఇక్కడ ఆ స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. దీంతో పక్షం రోజుల తర్వాత జిల్లాలో ఆ శాఖ వ్యవహారాలు కుంటుపడకుండా ఉండేందుకు డీఎల్‌డీవో కేడర్‌లో డీసీసీబీలో ఓఎస్‌డీగా ఉన్న ఎస్.ఇందిరాదేవిని ఇన్‌చార్జీ డీసీవోగా కలెక్టర్ అన్సారియా నియమించి ప్రభుత్వానికి తెలియజేశారు.

ధ్రువీకరించకుండా నాన్చుడు

ఇందిరాదేవి నియామకాన్ని ఉన్నతాధికారులు ధ్రువీకరించి ఆ బాధ్యతలను ఆమె నిర్వర్తించేందుకు వీలుగా అన్ని అధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి. అయితే అందుకు భిన్నంగా ఉన్నతాధికారులు వ్యవహరించడంతో ఆర్థికపరమైన విషయాలలో ఇందిరాదేవి జోక్యం చేసుకునే వీలు లేకుండా పోయింది. దీంతో కార్యాలయ ఉద్యోగుల జీతాల చెల్లింపు మూడు నెలలుగా నిలిచిపోయాయి. సహకార శాఖలో ఇలా జరుగుతున్న లోటుపాట్లపై పలు సందర్భాలలో 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. వాటిపై జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలో సంబంధిత పెద్దలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా సమస్య కొలిక్కిరాలేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు జీతాలు ఆగిపోవడం, అందుకు కారణాలపై ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో 'సహకార శాఖలో విచిత్రం' శీర్షికన ప్రచురితమైన కథనం ఉన్నతస్థాయిలో కలకలం సృష్టించింది. మంత్రి డాక్టర్ స్వామి ఉన్నతస్థాయి పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఇంటిలిజెన్స్ అధికారులు ఆ రోజున విచారించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఉద్యోగుల నిరసనతో పైస్థాయిలో కదలిక

తమకు జీతాలు నిలిచిపోయి అవస్థలు పడుతున్న విషయాన్ని ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ఆ శాఖ ఉద్యోగులు నిరసన చేపట్టి భిక్షాటన చేశారు. దానిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాన్ని మరోసారి మంత్రి నారా లోకేష్ దృష్టికి మంత్రి డాక్టర్ స్వామి తీసుకెళ్లారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న లోకేష్ బుధవారం అధికారులపై మండిపడి తక్షణ చర్యలకు ఆదేశించినట్లు సమాచారం. తదనుగుణంగా సీఎంవో అధికారుల సూచనలతో రాష్ట్ర సహకారశాఖ అధికారులు కదిలారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామంటూ డీసీవో ద్వారా బుధవారం సాయంత్రం వివరణ ఇచ్చారు. అందుకు వీలుగా గురువారం రాత్రి ఇందిరాదేవికి డీసీవో బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వడం కన్నా మరొక అధికారిని ఇక్కడ డీసీవోగా నియమించాలని ఉన్నతాధికారులు తొలుత ఆలోచన చేసి కడప జిల్లాకు చెందిన ఒక మహిళా అధికారి పేరు సూచిస్తూ ఫైల్ కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఇక్కడకు వచ్చేందుకు ఆమె సుముఖత చూపకపోవడం, తక్షణం ఇక్కడ జీతాల సమస్య పరిష్కారం అవసరం ఉండటంతో ఇందిరాదేవికి ఎఫ్ఏసీ బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. అలా ఆశాఖలో నాలుగైదు నెలలుగా సాగుతున్న గందరగోళానికి తాత్కాలికంగా తెరపడింది.

సౌకర్యాలు సరే.. వైద్యులేరీ..?

- త్రిశంకుస్వర్గంలో మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి
- బదిలీపై వెళ్లిపోయిన మెడికల్ కాలేజీ సిబ్బంది

మార్కాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మార్కాపురం డివిజన్. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం కావాలంటే ఎటుచూసినా 100 కిలోమీటర్లకుపైగా దూరం వెళ్లాల్సిందే. ఇంతటి కీలకమైన డివిజన్ కేంద్రం మార్కాపురంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఏరియా వైద్యశాల నుంచి జిల్లా వైద్యశాలగా గత టీడీపీ ప్రభుత్వంలో అప్‌గ్రేడ్ చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీ మంజూరు కావడంతో దానికి అనుబంధంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. అప్పట్లో సౌకర్యాలపరంగా ఇబ్బంది ఉన్నా పూర్తిస్థాయిలో వైద్యుల బృందం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో కాలేజీకి భవనాలు, ఇతర వసతులు సమకూర్చకపోవడంతో ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) తరగతుల ప్రారంభానికి అనుమతులను నిరాకరించింది. దీంతో బోధన వైద్యశాల సిబ్బంది మొత్తం వెనక్కి వెళ్లిపోయారు. ప్రసుత్తం 23మంది వైద్యులతోనే రోగులకు సేవలందించాల్సిన దుస్థితి నెలకొంది. 350 బెడ్లు, తగినన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నా స్పెషలిస్టు వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎమర్జెన్సీ కేసులు వస్తే ప్రాథమిక చికిత్స తప్ప ఇక్కడ మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేదు. అందు కోసం వందల కిలోమీటర్ల దూరంలోని ఒంగోలు, గుంటూరు, కర్నూలు, విజయవాడ లాంటి నగరాలకు వెళ్లాల్సిందే. ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టిసారించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వైద్యశాలను బలోపేతం చేయాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

113 మందికి ప్రస్తుతం ఉంది 23 మంది

వాస్తవానికి మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 350 బెడ్లు, 113 మంది వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు ఉండాలి. కానీ ప్రస్తుతం పనిచేస్తుంది కేవలం 23 మంది మాత్రమే. వారిలో కూడా ముగ్గురు డెంటల్ డాక్టర్లు ఉన్నారు. ప్రతి విభాగానికి సంబంధించి 3 నుంచి ఆరుగురు వరకు వైద్యులు ఉండాలి. అంతేకాక జనరల్ మెడిసిన్‌కు తొమ్మిది మంది, జనరల్ సర్జన్‌లు తొమ్మిది మంది చొప్పున ఉండాలి. కానీ ప్రస్తుతం కీలకమైన ఈ విభాగాలకు సంబంధించి ఐదుగురు మాత్రమే అందుబాటులో ఉన్నారు. స్పెషలిస్టు వైద్యుల కొరత ఎక్కువగా ఉండటంతో రాత్రివేళల్లో డ్యూటీ చేస్తే మరుసటి రోజు పగలు ఓపీలో ఉండలేని దుస్థితి ఏర్పడుతోంది. కొన్ని విభాగాలకు సంబంధించి ఒక్కొక్కరు చొప్పున మాత్రమే ఉన్నారు. అత్యంత కీలకమైన ఆర్థోపెడిక్ సర్జన్ ఒక్కరే ఉన్నారు. ప్రమాదాల్లో దెబ్బలు తగిలి ప్రభుత్వ వైద్యశాలకు వస్తే ఆర్థోపెడిక్ అందుబాటులో లేకుంటే ప్రైవేటు వైద్యానికి పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.

మొదట్లో 64 మంది అందుబాటులో..

మార్కాపురానికి మెడికల్ కాలేజీ 2021లో మంజూరైంది. అప్పట్లో ఎన్ఎంసీ నియమాల మేరకు 350 బెడ్లను 2022కల్లా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి సుమారు రెండేళ్ల పాటు బోధన, వైద్యశాలకు సంబంధించిన డాక్టర్లు సుమారు 64మంది అందుబాటులో ఉన్నారు. సౌకర్యాలు లేకపోయినా కనీసం నాడిపట్టే వైద్యుడైనా ఆసుపత్రిలో ఉన్నారు. ఎన్ఎంసీ అనుమతులు ఇవ్వక మెడికల్ కాలేజీ వ్యవహారం సందిగ్ధంలో పడటంతో వైద్యారోగ్యశాఖ ఇక్కడి వైద్యులను పలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు బదిలీ చేసింది. దీంతో ప్రస్తుతం వైద్యుల కొరత ఏర్పడింది.

నూతన సౌకర్యాలు ఉన్నా..

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక ఐసీయూ విభాగం లేకపోవడంతో రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ సమస్యను గమనించిన స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఒక ఐసీయూ యూనిట్, థైరాయిడ్ మిషన్‌లను ఏర్పాటు చేయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వైద్యుల కొరత నేపథ్యంలో వాటిని ఉపయోగించుకోవడం కష్టతరంగా మారే పరిస్థితి ఉంది. థైరాయిడ్ మిషన్ వద్ద కనీసం ఇద్దరు డాక్టర్లు ఉండాలి. అదేవిధంగా 10 బెడ్ల ఐసీయూ యూనిట్‌కు స్పెషలిస్టు వైద్యులు 10 మంది వరకు కావాల్సి ఉంది. ఇతర నర్సింగ్ స్టాఫ్‌ను ఏదోవిధంగా సర్దుబాటు చేసుకోవచ్చు. వైద్యశాలకు సౌకర్యాలు ఏర్పాటు చేసినా వాటిని సక్రమంగా ఉపయోగించుకోవాలంటే తప్పక తగినంత మంది డాక్టర్లు ఉండాల్సిందే.

ప్రభుత్వ భూమి హాంఫట్

(5వ పేజీ తరువాయి)

ఆ భూమిని ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఎకరా రూ.50లక్షలకు తన సొంత భూమితో పాటు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ విషయం సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ వారికి ముడుపులు ఇచ్చిన నోరుమూయించాడు. నెల రోజుల నుంచి కొనుగోలుదారుడు ప్రభుత్వ భూమిని చదును చేస్తుండడంతో అనుమానం వచ్చిన గ్రామస్థులు అడ్డుకున్నారు. వారిని కూడా భయభ్రాంతులకు గురిచేసి చదును చేసిన భూమి చుట్టూ కంచె వేసేందుకు రాళ్లు కూడా పాతాడు. గ్రామస్థులు సంబంధిత వీఆర్‌వోను నిలదీసినప్పటికీ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్ హెచ్చరించారు. కలుజువ్వలపాడులో ఆక్రమించుకున్న భూమి విషయం తన దృష్టికి వచ్చిందని శనివారం సర్వేయర్లను పంపించి సర్వే చేయిస్తానని, ప్రభుత్వ భూమిని విడగొట్టి రాళ్లు పాతించి నోటీసు బోర్డు పెట్టిస్తానని ఆయన వివరించారు.


కనిగిరి డెయిరీపై కన్ను

(5వ పేజీ తరువాయి)

డెయిరీలో నేడు పిచ్చిచెట్లు ఏపుగా పెరిగి భయానకప్రాంతంగా మారింది. రైతులు సేద తీరేందుకు ఏర్పాటుచేసిన షెడ్డు మందుబాబులకు, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

డెయిరీని వినియోగంలోకి తేవాలి

సైకం మాలకొండారెడ్డి, పాల ఉత్పత్తిదారుడు



కనిగిరి డెయిరీ దశాబ్ద కాలం క్రితం పాల ఉత్పత్తిదారులతో కళకళలాడింది. పాల సేకరణలో ప్రకాశం జిల్లా డెయిరీకి ఎంతో పేరుండేది. అప్పట్లో కొంతమంది డెయిరీ పెద్దలు చేసిన నిర్వాకంతో ఇది మూతపడింది. ఆక్రమంలోనే కనిగిరి డెయిరీకి కూడా తాళాలు పడ్డాయి. అందులోని విలువైన సామగ్రి మాయమైంది. ప్రాంగణం చిట్టడవిగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రైవేట్ డెయిరీలు రైతులను దోపిడీ చేస్తున్నాయి. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. వైసీపీ హయాంలో అమూల్‌కు అప్పజెప్పి పూర్తిగా జీర్ణావస్థకు తీసుకువచ్చారు. అక్రమార్కుల కన్నుపడి కబ్జాలకు గురవుతోంది. ప్రభుత్వ పెద్దలు పట్టించుకుని పాడి రైతులను ఆదుకోవాలి.

మున్సిపల్ కార్మికుల మానవహారం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు కూరగాయల మార్కెట్ ఎదుట మానవహారం నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ కార్యదర్శి రూబెన్ అన్నారు. జీవో నెంబర్ 36 అమలు చేసి షరతులు లేకుండా కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమయ్య, రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కార్మిక నాయకులు సుబ్బరాయుడు, గొట్టం హరికృష్ణ, రమణ, షేక్ ఇమాంసా, పఠాన్ సలాంఖాన్, షబ్బీర్, జార్జ్, కోటేష్ పాల్గొన్నారు.

కొండపి ఏఎంసీ చైర్మన్‌గా తిరుపతమ్మ

అవీఇవీ

ప్రభుత్వం ఉత్తర్వులు



సత్యకి కృతజ్ఞతలు తెలుపుతున్న తిరుపతమ్మ, కోటిరెడ్డి

పొన్నలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా కర్నా తిరుపతమ్మ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె పొన్నలూరు మండలం పైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కర్నా కోటిరెడ్డి సతీమణి. కోటిరెడ్డి తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, ఏఎంసీ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెలుగు రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తిరుపతమ్మకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎంసీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. శుక్రవారం తిరుతమ్మ, కోటిరెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామిని, ఒంగోలులో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు మండవ ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళి, ఉన్నం శ్రీనివాసులు, పాతూరి కోటయ్య, పల్లపోతు రమేష్‌బాబు ఉన్నారు.

గురుకులంలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఏపీ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.అనంతయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ, ఇంగ్లీషు, టీజీటీ, జనరల్ సైన్స్, టీజీటీ హిందీ ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి ప్రభుత్వ నిబంధనలను అనుసరించి గౌరవ వేతనం ఇస్తారని, వివరాలకు 8712625044 సెల్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

వాసవీమాతకు శాకంబరి అలంకారం



మార్కాపురం వన్‌టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాకంబరీ అలంకారం నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ కూరగాయలు, ఆకుకూరలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి దర్శించుకుని పూజలు చేశారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు

కొమరోలు, జూలై18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరవారిపల్లి గ్రామంలో కౌడు పీర్ల పండుగ మహోత్సవాల సందర్భంగా ఈనెల 20, 21 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 20న పగలు సరిగేసు రోజు ఉదయం 8గంటలకు 4పండ్ల విభాగంలో పోటీలు , 21న పెద్ద సరిగేసు రోజు ఉదయం 8గంటలకు రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగంలో బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్లజతల యజమానులకు ఆరు విభాగాలలో నగదు బహుమతులను అందివ్వనున్నారు. ఈపోటీలల్లో పాల్గొనే ఎడ్లజతల యజమానులు 9912013161, 8527381484లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.


కొండలను కప్పేసిన మంచు

వర్షం.. మంచుతో ఆహ్లాదం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు భానుడు భగభగమంటూ వేసవిని తలపించేలా ఎండలు కాశాయి. రైతులు వాన కోసం ఎదురు చూశారు. ఎట్టకేలకు శుక్రవారం అర్ధరాత్రి నుంచి తెల్ల వారుజాము వరకు ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. ఉదయం సన్నటి జల్లులు కురుస్తూ ఇటు రహదారులు పంట పొలాలు, కొండలు ఎంతో అందంగా కనిపిస్తూ ఆహ్లాదకరంగా దర్శనమిచ్చాయి. కొండల మధ్యలో మంచు కురుస్తున్న దృశ్యాలు చూస్తే ఊటీలో ఉన్నట్లు ఉందని వాతావరణ ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మూగజీవాల మేత కోసం వానా, ఎండా లేదు అన్నట్లు చిరు జల్లుల పడుతుండగానే అటవీ బాటపట్టిన దృశ్యాలు ఇలా వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందంటూ యువత సెల్ఫీలు దిగుతూ కనిపించారు.


వై.పాలెం - మార్కాపురం జాతీయ రహదారిలో మంచు, వర్షం

25 నాటికి ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలి

ఒంగోలు విద్య, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 25నాటికి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలి. ఈ మేరకు పాఠశాల విద్యాడైరెక్టర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎక్కడైనా గ్యాప్‌లు ఉంటే వాటిని 25వ తేదీలోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సరిచేసుకోవాలని సూచించారు. ఇప్పటికీ కొన్ని పాఠశాలల్లో ఆన్‌లైన్‌లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ ఇంకా మొదలు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పూర్తి చేసే విధంగా ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విద్యార్థుల అభ్యసనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజయరామరాజు ఆదేశించారు. అభ్యసనలో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని మెయిన్ స్ట్రీమ్‌కు తెచ్చేలా కృషి చేయాలన్నారు. 1, 2 తరగతుల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. సీఆర్ఎంటీఈలు ప్రతిరోజు ఉదయం తమ క్లస్టర్ పాఠశాలలో హాజరు నమోదు చేయాలన్నారు. శనివారం జరిగే క్లస్టర్ మీటింగ్‌కు టీచర్లు ఉదయం పాఠశాలలు నిర్వహించి పిల్లలకు మధ్యాహ్నం భోజనంపెట్టివారిని ఇళ్లకు పంపిన తర్వాత హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

నిధులు విడుదల చేయాలని 21న ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజవాడ శ్రీరామమూర్తి, పగడాల రమేష్, ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, అధికార ప్రతినిధి రావెళ్ల సుధాకర్‌లు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను ఆరు నెలలక్రితం నిధులు విడుదల చేసినా ఇంత వరకు ఆ నిధులను గ్రామ పంచాయతీలకు మంజూరు చేయలేదని తెలిపారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. డీఎస్సీ- 2003 ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు సుధాకర్ అధ్యక్షత వహించారు. ధర్నాలో రాష్ట్ర నాయకులు పఠాన్‌బాజీ ఖాన్, సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడారు. 2004నుంచి కొత్త పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని, కానీ అంతకంటే ముందుగానే ఉపాధ్యాయ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నోటిఫికేషన్ ఇచ్చారని, ఇప్పుడు కూడా ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నందున ఈ సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. సీపీఎస్ స్కీం కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కొన్నేళ్ళుగా ప్రభుత్వంలోని పెద్దలకు వినతిపత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం జారీచేసిన 57 జీవోనుఅమలు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫోరం కన్వీనర్లు వి.అనురాధ, జే మోజేష్, టీవీఎల్ఎన్ మూర్తి, టి. ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తీసుకుంది 86.55 శాతం

ముగిసిన పంపిణీ ప్రక్రియ

ఒంగోలు మండలంలో అత్యధికంగా 93.23శాతం నమోదు

జిల్లాలో 6,61,187 తెల్ల కార్డులకుగాను 5,72,237 మంది బయోమెట్రిక్

వైసీపీ హయాంలో 60 శాతంలోపే

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ పంపిణీ ప్రక్రియ ముగిసింది. జిల్లాలో జూలై నెలకు సంబంధించి ఈనెల 1 నుంచి రేషన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభించగా ఈనెల 15వ తేదీతో ఆ ప్రక్రియముగిసింది. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో 6,61,187 తెల్లకార్డులు ఉండగా అందులో 5,72,237 మంది బియ్యాన్ని తీసుకున్నారు. అంటే ప్రతి వంద మందిలో 87 మంది రేషన్ తీసుకున్నారు. అలా జిల్లా వ్యాప్తంగా 86.55 శాతం మంది తమ రేషన్ తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ ప్రక్రియ చేపట్టినా 50నుంచి 60శాతం మందిలోపు మాత్రమే రేషన్ అందేవి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్డుదారులకు సకాలంలో నిత్యవసర సరుకులు అందించేందుకు గత నెల నుంచి రేషన్‌షాపుల ద్వారానే బియ్యం పంపిణీ చేపట్టింది. రేషన్ షాపుల ద్వారా ఉదయం, సాయంత్రం సమయంలో రెండు పూటల కార్డుదారులకు సరుకులు ఇస్తుండటంతో వారి సమయానుకూలంగా ఉన్న సమయంలో ఆయా రేషన్ షాపుల వద్ద సరుకులు తీసుకుంటున్నారు.


రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్

ఒంగోలులో అత్యధిక పంపిణీ

ఒంగోలు అర్బన్, రూరల్ మండలాల్లో 108 రేషన్‌షాపులు ఉండగా ఆ షాపుల పరిధిలో 64,790 కార్డులు ఉండగా 60,405 మంది రేషన్ తీసుకున్నారు. అంటే దాదాపు 93.23శాతం మంది తమ రేషన్‌సరుకులను తీసుకున్నారు. సీఎస్‌పురం మండలంలో 35 రేషన్‌షాపుల పరిధిలో 11,832 రేషన్‌కార్డులు ఉండగా 8,725 మంది రేషన్ తీసుకున్నారు. సుమారు 73.74 శాతం మంది మాత్రమే తీసుకున్నారు. ఇక మిగిలిన మండలాల్లో 76శాతం నుంచి 90శాతం మేర లబ్ధిదారులు తమ రేషన్‌ను తీసుకున్నారు. ప్రజాప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో కార్డుదారులందరూ సకాలంలో రేషన్ తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి.

బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను గుర్తించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమం అమలులో భాగంగా జిల్లాలో అర్హులైన బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను గుర్తించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 79,911 బంగారు కుటుంబాలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. వీరికి కావాల్సిన అవసరాలను గుర్తించడంతో పాటు వాటిని సమకూర్చి ఆయా కుటుంబాలకు అండగా ఉండే మార్గదర్శకులను కూడా ఈనెల 25వతేదీ లోపు గ్రామ, వార్డు సభలు నిర్వహించి గుర్తించాలని చెప్పారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల వివరాలను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించి పీ4 వెబ్ సైట్‌లో పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. సహాయం చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, ఇతర ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా హోదాతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న అందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పారు. మార్గదర్శకులకు వారి సమీపంలో ఉన్న బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాలని, దీని ద్వారా బంగారు కుటుంబాలకు మంచి చేకూరుతుందని తెలిపారు. జిల్లాలో ఈనెల 19న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం అంతం అనే అంశంతో ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్లాస్టిక్ వినియోగం కారణంగా జరిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నివారించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, జాన్సన్, సత్యనారాయణ, వివిధశాఖల అధికారులు చిరంజీవి, జోసఫ్‌కుమార్, నారాయణ, శ్రీహరి, శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, సుశీల, పద్మశ్రీ, బాలశంకరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేష్, జడ్పీ సీఈవో చిరంజీవి

23న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 23వ తేదీ ఉదయం పదిన్నర గంటల నుంచి స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతాయని జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ కమిటీ, విద్య, వైద్య సేవలు, మహిళా శిశుసంక్షేమ, సాంఘిక సంక్షేమ, ప్రణాళిక, ఆర్థిక, పనుల స్థాయి కమిటీ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఆయా సమావేశాల్లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

జిల్లాలో 34.7 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయనికి గడిచిన 24 గంటల్లో 34.7 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యర్రగొండపాలెం మండలంలో 122.4 మి.మీ నమోదు కాగా అత్యల్పంగా పామూరు మండలంలో 5.6 మి.మీ కురిసింది. అలాగే టంగుటూరు మండలంలో 88.0. కొత్తపట్నం 77.4, మద్దిపాడు 70.2, జరుగుమల్లి 68.4, తాళ్ళూరు 59.8, దర్శి 54.6, సంతనూతలపాడు 52.6, తర్లుబాడు 49.8, పుల్లలచెరువు 49.4, బేస్తవారపేట 46.4, రాచర్ల 46.2, దొనకొండ 43.6, పెద్దారవీడు 42.8, చీమకుర్తి 40.0, సింగరాయకొండ 39.4, మార్కాపురం 36.2, పొన్నలూరు 32.4, నాగులుప్పలపాడు 30.2, గిద్దలూరు 26.8. కొండపి 21.4, పీసీపల్లి 21.2, అర్ధవీడు 20.2, పొదిలి 19.6, కంభం 19.6, దోర్నాల 18.6, మర్రిపూడి 18.6, కొమరోలు 17.2, కనిగిరి 16.6, కొనకనమిట్ల 15.6, కురిచేడు 15.0, ముండ్లమూరు 14.2, హనుమంతునిపాడు 11.2, ఒంగోలు రూరల్ 10.2, ఒంగోలు అర్బన్ 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఇంట్లో చోరీ


బీరువాను పగులకొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

ఒంగోలు క్రైం, జూలై18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న పొదిలి బ్రహ్మయ్య ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి సుమారు రూ.లక్ష సొత్తు చోరీ చేశారు. ఈ సంఘటన స్థానిక మామిడిపాలెంలో గల కరణం గారి వీధిలో శుక్రవారం వెలుగుచూసింది. బ్రహ్మయ్య తన భార్యతో కలిసి ఈనెల 16న హైదరాబాద్ వెళ్ళారు. శుక్రవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగలకొట్టి బీరువా పెకలించి ఉంది. రూ.55 వేల నగదు, ఒక బంగారం ఉంగరం, రెండు వెండి వస్తువులు దొంగలు అపహరించుకెళ్ళినట్లు వారు గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుళ్ల కుటుంబాలకు చేయూత

ఒంగోలు క్రైం, జూలై18(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ముగ్గురు ఎక్సైజ్ కానిస్టేబుళ్ల మృతి చెందగా, వారి అండగా జిల్లాలో ఉన్న కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళు తమ వంతు చేయూతను అందించారు. శుక్రవారం ఒంగోలులోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అంగడి శ్రీనివాసులు, జి.రాజశేఖర్, పీవీ.రామిరెడ్డి కుటుంబసభ్యులకు మొత్తం రూ.2,30,400నగదును డీసీ హేమంత్‌నాగరాజు, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల, హెడ్ కానిస్టేబుళ్ల అసోషియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, జనరల్‌సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు, నాయకులు సీహెచ్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె ఉధృతం

పట్టణ ప్రాంతాల్లో నిలిచిన చెత్త సేకరణ పనులు

పారిశుధ్యం లోపంతో అధ్వానంగా వీధులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల సమ్మె ఉధృతమవుతోంది. విధులు బహిష్కరించి, న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా సమ్మెకు దిగారు. దీంతో పట్టణాల్లో పారిశుధ్యం పేరుకుపోతోంది. ఇంటింటి చెత్త సేకరణ చేసేవారు లేక ఇళ్లలోనే చెత్త కుప్పలు పేరుకుపోతుండగా, వీధుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజులుగా సమ్మెకు దిగారు. తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించే వరకు సమ్మె ఉపసంహరించేది లేదని కార్మిక సంఘ నాయకులు చెబుతున్నారు. అరకొరగా ఉన్న రెగ్యులర్ కార్మికులతో నగర పరిశుభ్రత సాధ్యపడే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉండగా, అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల మందికి పైగా కార్మికులు సమ్మెలో పాల్గొనగా, 350మంది రెగ్యులర్ కార్మికులతో అధికారులు చేపడుతున్న పారిశుధ్యం మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉండగా, కార్మికుల సమ్మెకు పెన్షనర్స్ సంఘం తమ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మూడో రోజుకు చేరుకున్న సమ్మె

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆయా మునిసిపాలిటీల వద్ద ధర్నా నిర్వహించి, కార్యాలయాల ఎదుట మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం రోజూ కష్టపడి పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందన్నారు. ఏడేళ్ల నుంచి జీవో నెం.36 ప్రకారం ఇంజనీరింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు రూ.21వేలు వేతనం, స్కిల్‌కి రూ.24 వేతనం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అలాగే గత సమ్మెలో ఒప్పందం చేసుకున్న ప్రకారం సమ్మె కాలం జీతం వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహం, టి. విజయమ్మ తోపాటు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. సామ్రాజ్యం, అనిత, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫట్..ఫట్



మాడిఫైడ్ సైలెన్సర్లను రోలర్‌తో ధ్వంసం చేసిన పోలీసులు

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

ఒంగోలు క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మార్పు చేసి అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లను బైక్‌లకు అమర్చుకొని ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మంగమూరు రోడ్డులోని రత్నదీప్ స్టోర్స్ సెంటర్‌లో ద్విచక్రవాహనదారులు వినియోగించిన 550 మాడిఫైడ్ సైలెన్సర్లు(సుమారు రూ.25 లక్షలు విలువ)ను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ట్రాఫిక్ సీఐ పాండురంగారావు నేతృత్వంలో నగరంలో మాడిఫైడ్ సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని తిరుగుతున్న ద్విచక్రవాహనదారులను పిలిపించి కంపెనీ సైలెన్సర్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ట్రాఫిక్ ఎస్సైలు కోటయ్య, శ్రీనివాసరావు, శివప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొంగిన కొత్తకోట వాగు


వాగులో ప్రవహిస్తున్న వరద

నాగులుప్పలపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజుల నుంచి భానుడి ప్రతాపంతో తల్లడిల్లిన ప్రజలకు గురువారం ఒక్కసారిగా మారిన వాతావరణం చల్లని ఆహ్లాదాన్ని అందించింది. రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షంతో రోడ్లు జలమయం కాగా ఎగువ ప్రాంతంలోని వరద నీరు నాగులుప్పలపాడు తిమ్మనపాలెం రహదారిలోని కొత్తకోట వాగుకు చేరింది. దీంతో శుక్రవారం ఆ దారిలో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షానికే కొత్తకోట వాగుకు వరదనీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అక్కడ హైలెవల్ వంతెన నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా కార్యరూపం దాల్చడం లేదు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏడీ జెన్నమ్మ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ పి.జెన్నమ్మ సూచించారు. శుక్రవారం ఒంగోలులోని ఏపీఎంఐపీ కార్యాలయంలో సంబంధిత ఉద్యోగులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం కింద దరఖాస్తు వస్తే అందుకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందన్నారు. అందుకోసం చట్టంపై అవగాహన పెంచుకుని దరఖాస్తుదారునికి సకాలంలో సమాచారం ఇవ్వాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

22న రాజరాజేశ్వరస్వామి దేవస్థాన షాపుల బహిరంగ వేలం

ఒంగోలు కల్చరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం తూర్పుపాలెం శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన షాపుల లీజుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో బోడపాటి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రంకురోడ్డులోని 37-1-264లో ఉన్న రెండు షాపులకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి దేవస్థానం ఆవరణలో దేవదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందన్నారు. ఆగస్టు 1 నుంచి మూడు సంవత్సరాల కాలపరిమితి ఈ వేలం నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు ఆధార్‌కార్డ్ జిరాక్స్ రూ.20 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7013830673 సెల్ నెంబరులో సంప్రదించాలని శ్రీనివాసరావు కోరారు.

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన శుక్రవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. ఒంగోలు నుంచి మద్దిపాడు వెళ్లే ఆటోకు బ్రేకులు ఫెయిలై మోటార్ సైకిల్‌ను ఢీకొనగా ముప్పవరం గ్రామానికి చెందిన సీహెచ్.శివకృష్ణకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడినిక ఒంగోలులోని ఆస్పత్రికి తరలించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : వైసీపీ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రోడ్డున పడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు వైసీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కేవీ.రమణారెడ్డి, కఠారి శంకర్, వేముల శ్రీకాంత్, రమేష్‌రెడ్డి, పేరం ప్రసన్న పాల్గొన్నారు.

మెడికల్‌షాపుల్లో విస్తృతంగా తనిఖీలు


మందులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో పలు మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్లులు లేనివి, అలాగే కాలం చెల్లిన మందులు అమ్మకాలను గుర్తించారు. నెల్లూరు బస్టాండ్, రిమ్స్ సమీపంలో, కర్నూల్ రోడ్, మంగమూరురోడ్, చీమకుర్తి, సింగరాయకొండ, ప్రాంతాల్లో 13షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపినా, డ్రగ్ కంట్రోల్ నిబంధనలు విస్మరించి అధిక ధరలకు విక్రయించినవారిపై శాఖపరంగా కేసులు నమోదు చేసి దుకాణాలు సీజ్ చేస్తామని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరామమూర్తి హెచ్చరించారు. కొన్ని ఔషధ సంస్థలు మందులు విక్రయించిన తర్వాత రశీదు ఇవ్వడం లేదని తెలిపారు. నిషేధించిన కొన్ని రకాల మందులు అమ్మకాలు చేయడానికి వీలులేదన్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వివరించారు.

చీమకుర్తి: స్థానిక పట్టణంలోని పలు మెడికల్‌షాపుల్లో శుక్రవారం సాయంత్రం డ్రగ్ అండ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భవిచ్ఛిత్తి, నిద్రమందులు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు రావటంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రామమూర్తి తన సిబ్బందితో కలిసి తనిఖీలు జరిపారు. సమాచారం తెలుసుకున్న మెడికల్‌షాపు యజమానులు తమ దుకాణాలను మూసివేశారు.

పొగాకు రైతులు నిబంధనలు పాటించాలి

- ఆర్ఎం రామారావు

ఒంగోలు(రూరల్), జూలై18(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సాగు చేసే రైతులు బోర్డు నిబంధనలు తప్పక పాటించాలని ఆర్ఎం శీలం రామారావు కోరారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో శుక్రవారం జరుగుతున్న వేలం ప్రకియను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది కొంతమంది రైతులు ఒక బ్యారన్‌కు సాగు చేయాల్సిన పొగాకు పంటను సుమారు నాలుగు బ్యారన్‌లకు సరిపడ స్థాయిలో సాగు చేశారని చెప్పారు. 166 మిలియన్‌ల కిలోల ఉత్పత్తికి రైతులకు అనుమతి ఇస్తే ఏకంగా 240 మిలియన్‌ల కిలోల పొగాకు ఉత్పత్తి చేశారని, దీంతో అమ్మకాల ప్రక్రియలో ఇబ్బందికరమైన పరిస్థితి వచ్చిందన్నారు. దీనికితోడు పెట్టుబడులు కూడా పెరగడంతో రైతుకు వచ్చే ఆదాయాలకు గండి పడిందని పేర్కొన్నారు. అధికంగా పొగాకు పంట సాగు చేయటంతో వ్యాపారులు కొనుగోలు చేసినప్పటికీ గోదాముల్లో బేళ్లు స్టాకు చేసుకోవటం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే నష్టాలకు గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పొగాకు అంతర్జాతీయ మార్కెట్ పంట అని, ఏ దేశంలో పొగాకు తక్కువ ధరకు వస్తుందో వ్యాపారులు అక్కడే కొంటారని తెలిపారు. ఈ ఏడాది పొగాకు నారుమడులు అవసరం మేరకు మాత్రమే సాగు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జె.తులసి, రైతు నాయకులు పెనుబోతు సునీల్, కట్టా హనుమంతరావు, వైవీ.శేషయ్య, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎం రామారావు

సాగర్‌కాలువకు పొంచివున్న ప్రమాదం

- అక్రమ గ్రావెల్ టిప్పర్ల రాకపోకలతో మెత్తబడుతున్న సీసీగట్లు


గుంతలమయంగా మారిన రోడ్డు


గ్రావెల్ లారీల రాకపోకలతో కుంగిపోయిన కాలువ గట్టు

ఒంగోలు(రూరల్), జూలై18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల దగ్గరగల సాగర్ కాలువపై అక్రమంగా గ్రావెల్ టిప్పర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో సాగర్‌కాలువ సీసీగట్టు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కాలువ గట్టు మెత్తపడిపోయిందని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు. కాలువకు ఇరువైపులా 20నుంచి 50 అడుగుల వరకు గ్రావెల్ తవ్వకాలు చేశారని, దీంతో కాలువ కాంక్రీట్ దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పలుసార్లు కాలువ పక్కనే గ్రావెల్ తవ్వకాలను నిలుపదల చేసినప్పటికీ రాత్రి సమయంలో యథేచ్ఛగా అక్రమార్కులు తమ పని కానిస్తున్నారని అధికారులు, సిబ్బంది అంటున్నారు. కాలువ గట్టుపై టిప్పర్లు నడవకుండా ప్రయత్నించినా డ్రైవర్లు వారిని లెక్కచేయడం లేదు. గ్రావెల్ మాఫియా అండతో వాహనాలను తిప్పుతూనే ఉన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కాలువ గట్లు ధ్వంసమై సాగర్ నీటి సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలతో పాటు సాగర్ కాలువపై గ్రావెల్ టిప్పర్లు తిరగకుండా చర్యలు తీసుకోవాలని పరిసరి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం

- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల
- 11,13 డివిజన్లలో కొనసాగిన సుపరిపాలనలో తొలిఅడుగు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే ప్రజల సంక్షేమం సాధ్యపడుతుందని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని 11, 13వ డివిజన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజలను పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల్లో పింఛన్లు అందడం లేదని, మరికొందరు రేషన్ కార్డుల సమస్యల గురించి, తాగునీరు, పారిశుధ్యం సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మాగుంట, దామచర్ల ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో ఎంపీ మాగుంట మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి ఇల్లూ సంతోషంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి సంక్షేమం లభిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ బాధ్యతలు తీసుకున్న తొలిరోజే పింఛన్ల పెంపుపై సీఎం సంతకం చేశారన్నారు. అలాగే అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, రైతు భరోసా, డీఎస్సీ అమలు చేశారన్నారు. దాంతోపాటు వచ్చే నెలలో ప్రతి మహిళ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారన్నారు. ఇప్పటికే నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, అలాగే అయ్యన్నశెట్టి సత్రం పట్టాల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ కపిల్‌బాషా, గంగవరపు సందీప్, రమేష్, గుర్రాల రాజ్‌విమల్, టీఎస్‌సింగ్, శశికాంత్‌భూషణ్, నగర అధ్యక్షుడు బండారు మదన్, కొఠారి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి

- ఎమ్మెల్యే బీఎన్


కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని, వైసీపీ పాలకులు నాయకులు కనీసం రోడ్లు వేసిన దాఖలాలు లేవని చెప్పారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు పెట్టలేని దుస్థితిలో వైసీపీ పాలకులు పనిచేశారని, తమ కూటమి ప్రభుత్వం రాగానే గేట్లు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించే విధంగా కృషి చేశామని తెలిపారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ అవ్వాతాతలకు రూ.4వేలు పెన్షన్ అందించిన ఘనత సీఎం చంద్రబాబుదని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గోరంట్ల చిరంజీవి, గట్టినేని అయ్యన్న, మండపల్లి శ్రీనివాసరావు, పాడిబండ్ల అజయ్‌బాబు, ముళ్లూరి మురళి, నర్రా సురేష్, మండవ గోపీనాథ్, రెబ్బవరపు ప్రభాకర్, దాసరి అక్కయ్య, దేవబత్తిన ప్రసాద్, దాసరి రమేష్, కొమ్మాలపాటి సుబ్బారావు, పోతినేని శ్రీనివాసరావు, రావిపాటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు కనపర్తి శేషయ్య, జంపని రమ్యకృష్ణ, దుగ్గినేని నరసింహారావు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం

- ఎమ్మెల్యే దామచర్ల


బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ డిపోలో నూతన బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో కాలం చెల్లిన బస్సులు నడిపిందన్నారు. జిల్లాలో 524 ఆర్టీసీ బస్సులు ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 164 కొత్త బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. అందులో ప్రత్యేకించి ఒంగోలు డిపోకే 35 బస్సులు కేటాయించినట్లు వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం సీఎం చంద్రబాబు నాయుడు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆర్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర భాగంగా ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంలో కచ్చితమైన నిర్ణయాలను తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి బస్‌స్టేషన్‌లో ఆర్వో వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు, ఫ్యాన్‌లు, బస్టాండ్ ఆవరణాలు పరిశుభ్రత, కుర్చీలు అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. స్వచ్ఛతపై ప్రతి నాలుగు గంటలకు ఒకసారి రిజిస్టర్‌లో నివేదికలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జి.శ్రీనివాసరావు, పీవో ఒ.శ్రీనివాసరావు, ఏవో హఫీజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే దామచర్ల బస్సును ఆర్టీసీ ప్రాంగణంలో కాసేపు నడిపి అందరినీ ఉత్సాహపరిచారు.

పోస్టల్‌ను నిర్వీర్యం చేసే విధానాలు రద్దు చేయాలి

- ఒంగోలులో ఉద్యోగుల నిరసన


దర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఉద్యోగుల భద్రతకు భంగం వాటిల్లే విధానాలను వెంటనే రద్దు చేయాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో), నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌యూపీఈ జిల్లా సెక్రటరీ సిద్ధయ్య మాట్లాడుతూ పోస్ట్‌మెన్‌లకు ఈ-బైక్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెలివరీ సెంటర్ పేరును పోస్టల్ డెలివరీ సెంటర్‌గా మార్చాలని, వాటిలో హెడ్‌పోస్టాఫీస్‌లలో పనిచేస్తున్న వారిని నియమించాలని కోరారు. 2010, 2012 ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనల ప్రకారం పోస్ట్‌మ్యాన్‌లకు బీట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని డెలివరీ సెంటర్‌లో కనీస వసతులు కల్పించడంతోపాటు తపాలా శాఖ ద్వారానే మొబైల్ ఫోన్‌లు అందించాలని చెప్పారు. ముఖ్యంగా అందరికీ మెడికల్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ అసిస్టెంట్ సెక్రటరీ పి.క్రాంతికుమార్, డివిజన్ ప్రెసిడెంట్ ఎస్.రామాంజనేయులు, కోశాధికారి పి.మోహన్‌రావు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, లక్ష్మయ్య, బ్రహ్మతేజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పొన్నలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని ఎస్ఐ అనూక్ సూచించారు. వాటికి బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలతోపాటు, బెట్టింగ్‌లకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యలు, శిక్షలు.. సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

పారిశుధ్యంపై అవగాహన

మద్దిపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ మండవ శివానందరావు అన్నారు. శుక్రవారం సీతారాంపురంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన క్విస్ ఎన్‌సీసీ క్యాడెట్


విజయ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు విద్య, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయ్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా సత్తా చాటారు. జాతీయ స్థాయి థల్‌సైనిక్ క్యాంపునకు ఎంపికయ్యారు. అనంతపురంలో ఇటీవల జరిగిన క్యాంపులో పలు అంశాల్లో ప్రతిభను చాటడంతో ప్రతిష్ఠాత్మక జాతీయస్థాయి థల్‌సైనిక్‌క్యాంపునకు ఎంపిక చేశారు. ఒంగోలు, చీరాలలో జరిగిన క్యాంపుల్లో కూడా టెంట్ పిక్సింగ్‌లో ఆబస్టికల్ ట్రైనింగ్‌లో విజయం సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక క్విస్ కళాశాలలో విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతి జి.శ్రీనివాసరావు, ఐటీ విభాగాధిపతి సెంధిల్ తదితరులు పాల్గొన్నారు.

22న మద్దిపాడు మండల సమావేశం

మద్దిపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఆర్టీసీ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికతో హాజరుకావాలని ఆమె కోరారు.

23న నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్‌సభ్యులు, అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీల్లో స్థానిక లాయర్‌పేటలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను తమ ప్రతిభను చాటారు. జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ జోసెఫ్ తంబి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్కూలులో జరిగిన సభలో విద్యార్థులు హస్యశ్రీ, శివానీ, అక్షర, సిద్దార్థరుషి, నిరంజన్, మోక్షలక్ష్మి, హర్షిణి, పూర్ణ, సాజిత, పుష్కరలను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్, సమన్వయకర్త జి.శ్రీనివాసరావు, డీన్ బాలసుబ్రహ్మణ్యం, వైస్‌ప్రిన్సిపాల్ శివపార్వతి, నాసా ప్రాజెక్టు ఇన్‌చార్జి మధుస్మిత పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలి

పొన్నలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరబొట్లపాలెంలో జడ్పీ సీఈవో చిరంజీవి శుక్రవారం పర్యటించారు. స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. రోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ గురించి ఆరా తీశారు. తడి, పొడిచెత్తను విడివిడిగా సేకరించాలని హరిత రాయబారులకు సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపాద కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ వర్మీ కంపోస్టును పరిశీలించారు. పొన్నలూరు గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణను చూశారు. ఆటోతోపాటు చెత్త రిక్షాలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, పంచాయతీ కార్యదర్శులు గీత, నారాయణ, మండవ ప్రసాద్, జి.రమణారెడ్డి పాల్గొన్నారు.

హైస్కూల్‌కు కుర్చీల బహూకరణ


కుర్చీలను అందజేస్తున్న కొండలరావు

సింగరాయకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాతసింగరాయకొండ హైస్కూల్‌కు జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన బిల్డర్ పందిళ్ల కొండలరావు శుక్రవారం రూ.13 వేల విలువచేసే కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం కొండలరావును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


ఏంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరాయకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఎంఈవో కత్తి శ్రీనివాసరావును కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. బదిలీపై కొత్తగా మండలానికి వచ్చిన ఉపాధ్యాయుల జీతాలను త్వరగా చెల్లించాలని కోరారు. గత సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న టీచర్లకు సంపాదిత సెలవులు నమోదు చేయాలన్నారు. సుందర్‌నగర్‌లో ఎంపీపీఎస్ పాఠశాల నూతనంగా ఏర్పాటు చేయడం వలన అక్కడ పనిచేసే ఉపాధ్యాయుల జీతాలు త్వరితగతిన చెల్లించాలని ఏంఈవోకి వివరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసులు, ఎన్.వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, మాలీరావు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం మమ

- అధికారులు, సభ్యుల గైర్హాజరు

సింగరాయకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా ముగిసింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు మెజారిటీ భాగం గైర్హాజరయ్యారు. మండలంలోని 10 గ్రామాల్లో 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. వీరిలో కొంతమంది సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. 10 మంది సర్పంచులు ఉండగా పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, బింగినపల్లి సర్పంచ్ జెట్టి విజయలక్ష్మి మాత్రమే హాజరయ్యారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు సమావేశానికి గైర్హాజరవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వర్షంతో చిగురిస్తున్న రైతుల ఆశలు

మద్దిపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. గత 15 రోజుల నుంచి భూములు దుక్కులు దున్ని పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. అప్పటి నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో గురువారం రాత్రి మండలంలో కురిసిన వర్షం ఊరటనిచ్చింది. సుమారు 70 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా మండలంలో ప్రధానంగా మిరప, పత్తి, జొన్న, జనుము, మినుము, పిల్లిపెసర పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అధికంగా పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న పంటలకు వర్షం అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. పొలాల్లో నీళ్లు నిల వటంతో పంటలు సాగుకు అనుకూలమని భావిస్తున్నారు. పదునైన వాన కురిసిందనే ఆనందంలో మండలంలోని రైతులు ఉన్నారు.

అవీ..ఇవీ



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన ర్యాలీ

గిద్దలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని మద్దతు ప్రకటించారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చే విధంగా జీవోలు ఇవ్వాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చి సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు మురళి, రంగయ్య, ఆశ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌ల ప్రతినిధులు విశ్రాంతమ్మ, మునమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి వసంతలక్ష్మి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తర్లుపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడు మండలంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి వివిధ గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. తర్లుపాడు గ్రామానికి చెందిన కోలగట్ల రామకోటిరెడ్డికి రూ.34,500 చెక్కును, చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోటపాటి లోకేశ్వరరెడ్డికి రూ.24,360 చెక్కు, కలుజువ్వలపాడు గ్రామానికి చెందిన సిరిపురపు కోటయ్య రూ.71,900, మేకలవారిపల్లె గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు రూ.81,662, బుడ్డపల్లె గ్రామానికి చెందిన బండారు లక్ష్మికి రూ.30,700 చెక్కును ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు మేకల వెంకట్, నంబుల లక్ష్మయ్య, కందుల చిట్టిబాబు, జి.సుబ్బయ్య, ఎస్.కాశయ్య, ఆరికట్ల వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, అచ్చిరెడ్డి, మహేశ్, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళా రైతులకు విత్తనాల ప్యాకెట్లను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పెరటి తోటలు సాగు చేసుకోవాలి

● ఐసీడీఎస్ సీడీపీవో కమలకుమారి

పెద్దదోర్నాల, జూలై 18(ఆంధ్రజ్యోతి):గిరిజన మహిళా రైతులు పెరటి తోటలు సాగు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కమలకుమారి అన్నారు.స్థానిక రైతు భరోసా కేంద్రంలో సీడబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఎగువ చెర్లోపల్లి, నల్లగుంట్ల రైతులకు ప్రకృతి వ్యవసాయం, పెరటితోటల సాగు, చిరుధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమలకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం, సంస్థల సహకారంతో చెంచు మహిళలు ఇంటి ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల చెట్లను సాగు చేసుకుంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందడమే గాకుండా కుటుంబ అవసరాలు తీర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏఈవో చైతన్యకుమార్ మాట్లాడుతూ రైతులు వాతావరణం, వాణిజ్య మార్కెటింగ్ వంటి ప్రస్తు పరిస్థితులకు అనుగుణంగా పైర్లు సాగు చేసుకోవాలన్నారు. అనంతరం కూరగాయలు, ఆకుకూరల విత్తనాల కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్‌వీఎఫ్‌ఆర్ కో ఆర్డినేటర్ బీ మంతన్న, సంస్థ ప్రతినిధి డీ వైశాలి, సిబ్బంది బాలరాజు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

గిద్దలూరు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోటగడ్డ వీధిలోని అనూష స్కూల్ విద్యార్థులతో డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ శానిటరీ, ఆశ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, డెంగ్యూ వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రస్తుతం వర్షాకాలం కావడం, దోమలు వృద్ధి చెందుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది బి.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు బేబీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, అనూష పబ్లిక్ స్కూల్ హెచ్‌ఎం వెంకటతిరుమలయ్య, టీచర్లు పాల్గొన్నారు.

21న నేత్ర వైద్యశిబిరం

గిద్దలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో గల విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 21వ తేదీ సోమవారం ఉదయం 10గంటల నుంచి నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాలలోని శాంతిరామ్ ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈశిబిరం నిర్వహిస్తున్నామని, ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డు, జర్నలిస్టు కార్డు ఉన్న వారికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

కరుణించిన వరుణుడు
పలు మండలాల్లో భారీ వర్షం
పంటలకు జీవం
పొంగిన వాగులు, నిండుతున్న చెరువులు, కుంటలు

● చెరువులకు జలకళ
● పంటలకు అనుకూలం
● సాగుకు సన్నద్ధం

పెద్దారవీడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభంలో ముఖం చాటేశాడనుకున్న వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. గురువారం అర్ధరాత్రి 1 గంట నుంచి 5 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో పశ్చిమ ప్రాంతంలోని చెరువులలో జలకళ సంతరించుకుంది. మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి కాల్వలు నిండాయి. పుచ్చకాయలపల్లి పొలాల మధ్యలో ఉన్న నల్లకాల్వ పొంగి పొరిలింది. పెద్దారవీడు-పుచ్చకాయలపల్లి మధ్య ఉన్న చప్టాపై నుంచి వర్షపునీరు ప్రవహించింది. పుచ్చకాయపల్లి పొలాలు వర్షపునీటితో నిండిపోయాయి. పెద్దారవీడు చెరువులో నీళ్లు కనబడి సుమారు 14 యేళ్లు దాటింది. గురువారం రాత్రి కురిసిన వర్షంతో జలకళ సంతరించుకుందని రైతులు చెబుతున్నారు. పుచ్చకాయలపల్లి నుంచి వచ్చే వర్షపునీటితో పెద్దారవీడు చెరువు సుమారు సగం వరకూ నిండింది. ఇలాగే మరో వర్షం కురిస్తే చెరువు ఆయకట్టు కింద పంటలు సాగు అవుతాయని, బోర్లలో నీరు పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

నీట మునిగిన పత్తి

పెద్దారవీడు-జమ్మనపల్లి మధ్య పత్తి సాగు చేసిన పొలాలు నీట మునిగాయి. దీంతో ఆయా రైతులు కాల్వలు తీసి వర్షపు నీటిని బయటకు పంపుతున్నారు. నీట మునిగినప్పటికీ ఇటువ ర్షంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. పెద్దారవీడు మండల పరిధిలో ఉన్న వెలిగొండ మైనర్ కాల్వలలో వర్షపునీరు ప్రవహిస్తోంది.


భారీ వర్షానికి పెద్దారవీడులో నీట మునిగిన పత్తి పంట

పొంగిన వాగులు

జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్


పుల్లలచెరువు మండలం చాపలమడుగు వద్ద ఉధృతంగా పారుతున్న దువ్వలేరు వాగు

పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలో వేకువ జామున భారీ వర్షం కురిసింది. ఓ వైపు సాగు చేసిన పంటలు వాడు ముఖం పట్టాయని రైతులు ఆందోళనలో ఉన్న వేళ కురిసిన వర్షం మెట్టపైర్లకు జీవం పోసింది. పంటలకు ఊరట నిచ్చింది. పుల్లలచెరువు మండల వ్యాప్తంగా 49.4 మీ.మీ వర్ష పాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.నల్లమలఫారెస్టులో భారీ వర్షం కురువడంతో పుల్లల చెరువు మండలంలోని జాతీయ రహదారి 565పై మురికిమల్ల తాండ-శిరిగిరిపాడు మధ్యలో జరుగుతున్న రోడ్డు పనుల కారణంగా రోడ్డు నుంచి లారీ జారీ పోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.రహదారి అధికారులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పుల్లలచెరువు- యర్రగొండపపాలెం రోడ్డుపై చాపలమడుగు వద్ద దువ్వలేరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుకు ఇరువైపులా గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి.సి.కొత్తపల్లిలో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి.



ఎర్రగొండపాలెం మండలం బోయలపల్లి వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌లో చేరిన నీరు

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇదే పెద్ద వర్షం

ఎర్రగొండపాలెం: ఎర్రగొండపాలెం మండలంలో గురువారం రాత్రి నుంచి వేకువ జాము వరకు 122.4 మీ.మీ వర్షం కురిసింది. భూమి పదునెక్కింది, సాగులో ఉన్న పండ్లతోటలకు, వేసవిపత్తి, మొక్క జొన్న పైర్లకు జీవం పోసిందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల నాటిన మిరప , బొప్పాయి , అరటి మొక్కలు నీరు లేక వాడు ముఖం పట్టాయి. ఈతరుణంలో గురువారం రాత్రి కురిసిన వర్షం పైర్లకు జీవం పోసింది. మండలంలో ఇప్పటికే సాగుచేసిన కంది, పత్తితో పాటు పెసర,మినుము, జొన్న పైర్లు వేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

నిండిన కుంటలు, చెక్ డ్యామ్‌లు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని బోయలపల్లి, అమానిగుడిపాడు, తమ్మడపల్లి, వెంకటాద్రిపాలెం, గోళ్లవిడిపి గ్రామాలతో పాటు పలు గ్రామాలలో గురువారం రాత్రి వర్షం కురిసింది. మండలం వ్యాప్తంగా 122.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు ఈ వర్షంతో సాగులో ఉన్న పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోయలపల్లి, గురిజేపల్లి, అమానిగుడిపాడు గ్రామాలలో ఉన్న చెరువులకు నీరు చేరింది. నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లలో నీరు ప్రవహిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.


ఎర్రగొండపాలెంలో నీట మునిగిన బొప్పాయి మొక్కలు

వర్షంతో పంటలకు జీవం

గిద్దలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేసవిని మరిపిస్తూ ఎండలు మండిపోతుండగా సాగులో ఉన్న పంటలకు నీరు లేక ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. ఈనేపథ్యంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈవర్షం సాగులో ఉన్న పంటలకు జీవం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సీజన్‌లో ప్రస్తుతం గిద్దలూరు మండలంలో 370 హెక్టార్లలో ఆముదం, 216 హెక్టార్లలో చిక్కుళ్ళు, 70 హెక్టార్లలో మొక్కజొన్న, 83 హెక్టార్లలో మినుము, 223 హెక్టార్లలో నూగు, 76 హెక్టార్లలో కొర్ర, 150 హెక్టార్లలో పత్తి, 50 హెక్టార్లలో సజ్జ, 60 హెక్టార్లలో కంది, 80 హెక్టార్లకు పైగా టమోటా, మిరప, మటిక, పసుపు పంటలు సాగు చేశారు.

ఈ పంటలన్నింటికీ ప్రస్తుతం కురిసిన వర్షం జీవం పోసిందని రైతులు చెబుతున్నారు. సుమారు పదునైన వాన పడినందున రాబోయే రెండు, మూడు వారాలలో చాలా గ్రామాల పరిధిలో కందిపంటను సాగు చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా పండ్లతోటలు, ఆకుకూరల సాగుదారులకు ఈవర్షం ఎంతో ఉపకరించింది.


వర్షానికి పచ్చగా కళకళలాడుతున్న వేసవి పత్తి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

రాచర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చోళ్లవీడు గ్రామంలో పర్యటించారు. ఈకార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని కుటుంబాలను సందర్శించి ఏడాదికాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు అందచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


రాచర్ల మండలం చోళ్లవీడులో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వెనుకబడిన వారిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక

గిద్దలూరు టౌన్ : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించడం, ఆర్థిక సామాజిక స్థితిలో మార్పు కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కంభం డివిజన్‌కు చెందిన ఎస్‌డీసీ, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆర్థిక సామాజిక పరిస్థితుల్లో మార్పు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో వీరికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వ్యక్తిగత వృద్ధి, ఉపాధి, ఆరోగ్యం, విద్య వంటి అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

సుపరిపాలనకు అభివందనం

● నలుగురి పిల్లలకు 52వేలు ఖాతాలో జమయిందన్న రమణమ్మ

పెద్దదోర్నాల :తన నలుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తించిందని, కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనకు అభివందనాలని మువ్వా రమణమ్మ పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రకోట గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంటు టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అమలు చేసిన పథకాలు, విడతల వారీగా చేయనున్న పథకాలను వివరించారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన రమణమ్మ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ తన నలుగురి పిల్లలకు రూ.52వేలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయని తెలిపింది. అనంతరం పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మునగాటి సుబ్బరాయుడు, కర్ర తిరుపాలు రెడ్డి, సుబ్బయ్య, దేవయ్య, మరియబాబు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే సేవ

● టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవటమే నిజమైన సేవ అని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని డీవీఎన్ కాలనీలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంచానికే పరిమితమైన ఒక యువకుని చూసి చలించి ఆయన నేతలతో మాట్లాడారు. వెంకటేశ్వర్లు అనే యువకుడు కొన్నాళ్లుగా మంచంలో ఉండగా పింఛను రావటం లేదని తెలుసుకుని ఇలాంటి వారిని వైద్యశాలకు తీసుకెళ్లి సదరం సర్టిఫికెటు ఇప్పిస్తే పింఛన్ వస్తుందని, ఇలాంటి పనులద్వారానే నాయకులకు పేరు వస్తుందని అన్నారు. అక్కడికక్కడే వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు.

మండలంలోని పాత ముడివేముల గ్రామానికి చెందిన ఉన్నగిరి రమేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 72,500 రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


మంచంలో ఉన్న యువకుడిని పరామర్శిస్తున్న ఎరిక్షన్‌బాబు

పుస్తకాల పంపిణీ

కంభం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం జంగంగుంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఒక్కొక్కరికి 250 రూపాయల విలువ చేసే కాపీరైటింగ్ పుస్తకాలను, డైరీలను పాఠశాల పూర్వవిద్యార్థి సబ్బసాని వెంకటరంగారెడ్డి అందజేశారు. గతంలో కూడా రంగారెడ్డి పాఠశాలకు అవసరమైన మినరల్ వాటర్‌ను అందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న వెంకటరంగారెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

వైసీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్

తర్లుపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా తర్లుపాడు మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కేతగుడిపి సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్‌ను నియమించారు. పెద్దమస్తాన్‌ను పలువురు వైసీపీ నాయకులు అభినందించారు.


స్థానిక సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన థైరాయిడ్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఏ కందుల

నేడు మార్కాపురంలో మంత్రి స్వామి పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన ఎంఎల్‌ఏ కందుల

మార్కాపురం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి). మార్కాపురంలోని సర్వజన వైద్యశాలలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఐసీయూ, థైరాయిడ్ కేంద్రాలను శనివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఏ కందుల నారాయణరెడ్డి శుక్రవారం సర్వజన వైద్యశాలలో ఏర్పాట్లను, మండలంలోని బోడపాడు గ్రామాలలో పరిశీలించారు. ఐదు లక్షల రూపాయలతో ఐసీయూ గది ఆధునికీకరణ, ఐదు లక్షల రూపాయలతో థైరాయిడ్ పరీక్షా పరికరాలతో గదిని ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని బోడపాడు గ్రామంలో 55 లక్షల రూపాయలతో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్ల ను, గోకులం షెడ్‌లను ప్రారంభిస్తారు. అనంతరం గ్రామస్థులతో సమావేశంలో పాల్గొంటారు. అలాగే మండలంలోని నికరంపల్లి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. మండలంలోని వేములకోట పంచాయతీలోని జంకె రామిరెడ్డి కాలనీలో ప్రజలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పెద్దదోర్నాల, జూలై 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో వ్యక్తి హత్య కేసుకు సంబంధించి నలుగురు నిందితులు మొద్దు తిరుపతిరావు, బాల తిరుమలయ్య, మొద్దు వెంకటేశ్వర్లు, మొద్దు రాముకుమార్‌లను అరెస్టు చేసినట్లు ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్‌రావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నల్లగుంట్ల గ్రామానికి చెందిన మొద్దు వెంకటేశ్వర్లు 2022 సంవత్సరం ఫిబ్రవరి 9వతేదీన హత్యకు గురయ్యాడు. ఇందులో బైరబోయిన వెంకటేశ్వర్లు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ నెల 4వ తేదీన నల్లగుంట్లలో పీర్లపండుగ సందర్భంగా వచ్చిన బైరబోయిన వెంకటేశ్వర్లు పీర్లకు మొక్కేందుకు కిందకు వంగడంతో నిందితులు విచక్షణా రహితంగా కత్తులతో నరికి హత్యచేసి పరారయ్యారని సీఐ చెప్పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో మార్కాపురం డీఎస్పీ నాగరాజు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో కొర్రప్రోలు వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు.ఈ సమావేశంలో సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై వీ మహేశ్ సిబ్బంది ఉన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల డ్రగ్స్, సైబర్ నేరాలు పెరిగిపోయిన నేపథ్యంలో విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు జడ్పీహెచ్‌ఎస పాఠశాల ఆవరణలో ప్రజలకు, విద్యార్థులకు గంజాయి, సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యవత చెడువ్యసనాలకు బానిసలౌతున్నారని తల్లిదండ్రులు విద్యార్థుల ప్రవర్తనపై దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల విద్యార్థులకు ఫోన్‌లు ఇవ్వకుండా చదువుపై దృష్టిపెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఏపీకే ఫైల్స్ వస్తే వాటి లింక్ ఓపెన్ చేయడం వలన బ్యాంక్ ఖాతాలో ఉన్న మీ నగదు మాయమైపోతుందని తెలిపారు. కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు ఫ్రాడ్‌కాల్స్ వచ్చినప్పుడు లిఫ్ట్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ అరుణకుమారి, ఎస్ఐ వేమన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి మృతి

గిద్దలూరు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంజీవరాయునిపేట సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి (78) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. సంజీవరాయునిపేట సింగిల్‌విండో అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన కుమారుడు మార్తాల సుబ్బారెడ్డి గిద్దలూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. సుబ్బారెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తాళ్ళపల్లె గ్రామానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఇంకా నివాళులు అర్పించిన వారిలో జడ్పీటీసీ బుడత మధుసూదన్, గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డు చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, రాచర్ల మండల పార్టీ అధ్యక్షుడు కటికె యోగానంద్, సొసైటీ బ్యాంక్ చైర్మన్లు దుత్తా బాలీశ్వరయ్య, ఎం.రామసుబ్బయ్య, జీవనేశ్వర్‌రెడ్డి, బిజ్జం రవీంద్రరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ గోడి ఓబులరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నరాయునిపల్లి గ్రామంలోని కూల్ డ్రింక్ దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఒకరిని అరెస్ట్ చేసి 11 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు ఎర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రాచర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని యడవల్లి క్రాస్ రోడ్డు, గిద్దలూరు-ఒంగోలు జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు సమాచారం మేరకు కొమరోలు మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల చిన్నవెంకటయ్య (74) రాత్రి 11 గంటల ప్రాంతంలో మతిస్థిమితంలేని కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయాడని, యడవల్లి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురై మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయురాలికి సన్మానం

కంభం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం యర్రబాలెం ఎంపీపీ స్కూల్‌లో 8 సంవత్సరాలుగా పని చేసి బదిలీపై తురిమెళ్ల పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయురాలు జ్యోతి లక్ష్మమ్మను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగమణి, రాజశేఖర్, ఎంపీటీసీ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


శాకంబరి అలంకరణలో వాసవీమాత

శాకంబరీగా వాసవీమాత

పామూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని అమ్మవారిని శుక్రవారం శాకంబరీగా అలంకరించారు. సాయంత్రం పలురకాల కూరగాయలతో వాసవీమాతను అలంకరణ చేశారు. శాకంబరీ అలంకరణలో ఉన్న అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డీలర్లు బాధ్యతగా పనిచేయాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 18(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు బాధ్యతగా పనిచేస్తూ కార్డుదారుల మన్ననలు పొందాలని తహసీల్దార్ మహ్మద్ హుసేన్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా 26 నుంచి 30వ తేదీలోపు వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ భూపతి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

దొనకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): యూరియా ఎరువును అధికంగా వాడకాన్ని తగ్గించుకోవాలని ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రామమ్మోహన్‌రావు రైతులకు సూచించారు. మండలంలోని ఆరవల్లిపాడు గ్రామ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణానాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు ధనరాజ్, ఏఈవో యోగేశ్వరరావు, ఎంపీఈవో విన్నిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఉగ్రను కలిసిన దేవకి

కనిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల జనసేన పార్టీలో చేరిన దేవకి వెంకటేశ్వర్లు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా దేవకి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. జాతీయ వాసవీ సత్ర సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు ఇటీవల వైసీపీని వీడి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

కురిచేడులో భారీ వర్షం

కురిచేడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కురిచేడులో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పొలాల్లో నీరు పారింది. ఈ వర్షంతో రైతులు విత్తనాలు విత్తే అవకాశాలు మెండుగా ఉన్నాయి. భారీ వర్షంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి పెరిగిన ఎండలతో పంటలు సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈ వర్షం రైతుల్లో ఆశలు రేకెత్తించింది. శుక్రవారం రైతులు విత్తనాల షాపుల వద్దకు క్యూ కట్టారు.

టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం

పామూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ కార్యదర్శి ఆర్‌ఆర్ రఫి అన్నారు. శుక్రవారం పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న పథకాల అమలు తీరు గురించి లబ్ధిదారులను ప్రశ్నిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, షేక్ చినబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బూత్ నెంబర్ 278లో సుపరిపాలన కార్యక్రమం చేపట్టి ఇంటింటికి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ నీరుకట్టు నాయబ్‌రసూల్, ఇండ్ల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలి

పామూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌హై డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన పామూరు, సీఎస్‌పురం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల తరువాత అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బి.మాధవరావు, ఎం.సురేష్, బి.ఉదయ్‌కుమార్, వెంకట్రామయ్య, షేక్ పాదుషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- తగ్గిన విద్యార్థుల సంఖ్య
- మూతబడిన యర్రబాలెం ప్రాథమిక పాఠశాల

దొనకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. మరోవైపు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో సర్కారు బడుల్లో సమస్యలు నెలకొన్నాయి. యర్రబాలెం గ్రామంలోని జనరల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు సమీపంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చేరటంతో ఈఏడాది మూతబడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నా ఆదరణ కోల్పోవడంపట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని 61 ప్రాథమిక పాఠశాలల్లో 121 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో 71 మంది ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. మండలంలో 25 ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఎవ్వరూ కోరుకోలేదు. ఫలితంగా ఇక్కడినుంచి కోరుకున్న ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన కొందరు ఉపాధ్యాయులకు రిలీవర్ లేనికారణంగా పాత పాఠశాలల్లోనే పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.


యర్రబాలెంలో మూతబడిన ప్రాథమిక పాఠశాల

ప్రస్తుతం 61 పాఠశాలల్లో కేవలం 57 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఎనిమిది జడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో దాదాపు 30 మంది ఉపాధ్యాయుల కొరత ఏర్పడినట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది విద్యార్థుల సంఖ్యతో ప్రస్తుత విద్యా సంవత్సరం సంఖ్యతో పోలిస్తే దాదాపు 300 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లినట్లు సమాచారం. మండలంలో ఎనిమిది ఉన్నత, ఒక ప్రాథమికోన్నత, 60 ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది 5153 మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం ఆరు ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పటికే 1765 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. ప్రైవేట్ యాజమాన్యం ఇటీవల ప్రైవేట్ పాఠశాలల్లో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఆ సంఖ్య రెండు వేలకు చేరుతుందనేది సమాచారం. దీంతో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతుండగా, ప్రభుత్వ పాఠశాలల్లో ఇటు ఉపాధ్యాయుల కొరత, అటు విద్యార్థుల సంఖ్య తగ్గటంతో వెలవెలబోతున్నాయి. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతకలిగిన విద్యావంతులైన నిరుద్యోగులను విద్యా వలంటీర్లుగా నియమిస్తే ఉపాధ్యాయుల కొరత తీరటమే కాక విద్యార్థుల విద్యాభివృద్ధికి ఢోకా ఉండదని ప్రజలు భావిస్తున్నారు.

కాగా, ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షలకు సంబంధించి త్వరలోనే ఫలితాలను ప్రకటించి ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షానికి జీవం పోసుకున్న పైర్లు

దర్శి, జూలై 18(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో గురువారం రాత్రి భారీవర్షం కురిసింది. ఈవర్షానికి ఖరీఫ్‌లో సాగు చేసిన పైర్లు జీవం పోసుకున్నాయి. సుమారు నెల రోజుల క్రితం కురిసిన వర్షానికి పెసర, కంది, మొక్కజొన్న, సజ్జ తదితర పైర్లు సాగు చేశారు. ఆతర్వాత వర్షం కురవకపోవటంతో పైర్లు వాడు ముఖం పట్టాయి. రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో వరుణ దేవుడు కరుణించి భారీ వర్షం కురవటంతో వాడుముఖం పట్టిన పైర్లు జీవం పోసున్నాయి. దర్శిలో 54.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కురవటంతో భూములు పదునెక్కాయి.


దర్శిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి జీవం పోసుకున్న పెసర పైరు

రాష్ట్రంలో సుపరిపాలన

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): గెలిచిన తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం సాగిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఏడాది సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మాచవరం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక కుటుంబంలో ఒక విద్యార్థికే అమ్మఒడి ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం పథకంతో కుటుంబంలో విద్యనభ్యసిస్తున్న అందరికి నగదు వేశారన్నారు. విద్యా రంగాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ప్రతిఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. కనిగిరి ప్రాంతంలో జరిగిన అభివృద్ధిపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను సేకరించారు.


మాచవరం గ్రామంలో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నమోదు చేసుకున్నారు. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో హెచ్ ఎంపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వెంగపల్లి గ్రామాల్లో సుపరిపాలన కార్యక్రమాన్ని మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం రాష్ట్రంలోనే అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో కుందురు నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు ఉత్తమసేవలు అందించాలి'

కనిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా అధికారులు ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు హాలులో అధికారులకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించే క్రమంలో అధికారులు చొరవ చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా అధికారులు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలను గుర్తించాలన్నారు. వారిని దత్తత తీసుకుని ఆర్థిక పురోగతికి బాసటగా నిలిచేవిధంగా ప్రముఖులను ప్రోత్సహించాలన్నారు. స్వచ్ఛందంగా ముందుకువచ్చిన వారి వివరాలను సేకరించి పేదరిక నిర్మూలను కృషి చేయాలన్నారు. వెట్టి చాకిరిలో మగ్గుతూ దుర్భరంగా ఉన్న కుటుంబాలకు మీ వంతుగా చేదోడుగా నిలవాలని సూచించారు. సంచార జాతుల వారి కుటుంబాలను గుర్తించి ఆధార్ కార్డులు నమోదు చేయించి వారికి ప్రభుత్వ పథకాలు అందించేలా చొరవ చూపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న వారిలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో ప్రభాకరశర్మ, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, ఎంఈవో యూవీ నారయాణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

కనిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులవ్వాలని ఎస్ఐ టి.శ్రీరాం అన్నారు. పట్టణంలో శుక్రవారం ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాలను వివరిస్తూ పోలీసులు వినూత్న ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 45 మైక్రాన్స్ కంటే ఎక్కువగా ఉన్న ప్లాస్టిక్ వాడకంవల్ల క్యాన్సర్, తదితర అనారోగ్యాల పాలవుతారని తెలిపారు. పట్టణంలోని ప్రతి షాపువారు ప్లాస్టిక్‌ను రోడ్లపై, కాలువల్లో వేయకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మటం చట్టరీత్యా నేరమన్నారు. వాటస్థానంలో గుడ్డ సంచులను వాడుకోవాలని సూచించారు. ఈసందర్భంగా షాపుల వెంట పడిఉన్న ప్లాస్టిక్ వస్తువులను సేకరించి సంచుల్లో వేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


షాపుల నిర్వాకులకు ప్లాస్టిక్ అమ్మకం, వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న ఎస్ఐ శ్రీరాం

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

వెలిగండ్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన పోకూరి శివ(25) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివ బేల్దారి పనికోసం చెన్నై వెళ్ళాడు. రోజు వారీ పనిలో భాగంగా గురువారం పనులుచేస్తూ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నై పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శుక్రవారం కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడి తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లి నారయణమ్మ పిల్లల్ని పెంచి పోషించింది. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటంతో చూపరులను కలచివేసింది. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

కురిచేడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతులు నల్లబర్లీ పొగాకు పంటను సాగు చేయవద్దని మండల వ్యవసాయాధికారి సంపత్‌కుమార్ అన్నారు. పొగాకుకు బదులు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేయాలన్నారు. మండలంలోని పొట్లపాడు గ్రామంలో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం వారు ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 క్రింద ఖరీఫ్‌లో సాగు చేసే పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ పంట మార్పిడి, అంతర పంటలు సాగు చేయడంతో లాభాలు, మిశ్రమ పంటలు సాగుచేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లికార్జున్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధానాలు రద్దు చేయాలి

- ఉద్యోగుల నిరసన

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఉద్యోగుల భద్రతకు భంగం వాటిల్లే విధానాలను వెంటనే రద్దు చేయాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో), నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌యూపీఈ జిల్లా సెక్రటరీ సిద్దయ్య మాట్లాడుతూ పోస్ట్‌మెన్‌లకు ఈ-బైక్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెలివరీ సెంటర్ పేరును పోస్టల్ డెలివరీ సెంటర్‌గా మార్చాలని, వాటిలో హెడ్‌పోస్టాఫీస్‌లలో పనిచేస్తున్న వారిని నియమించాలని కోరారు. 2010, 2012 ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనల ప్రకారం పోస్ట్‌మ్యాన్‌లకు బీట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని డెలివరీ సెంటర్‌లో కనీస వసతులు కల్పించడంతోపాటు తపాలా శాఖ ద్వారానే మొబైల్ ఫోన్‌లు అందించాలని చెప్పారు. మెడికల్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.

కార్యక్రమంలో సర్కిల్ అసిస్టెంట్ సెక్రటరీ పి.క్రాంతికుమార్, డివిజన్ ప్రెసిడెంట్ ఎస్.రామాంజనేయులు, కోశాధికారి పి.మోహన్‌రావు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, లక్ష్మయ్య, బ్రహ్మ తేజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా నారాయణస్వామి ఆరాధన

సీఎస్‌పురం(పామూరు), జూలై 18(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి గురువారం రాత్రి పల్లకిసేవ అనంతరం పది గంటల నుంచి జరిగిన శ్రీదేవి-భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివార్ల గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో నరసింహబాబు, దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ మాజీ అధ్యక్షుడు పాములపాటి మాధవప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసేవారికి ఆదరణ

పామూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వృత్తి పట్ల అంకితభావంతో సేవ చేసే వారికి ఎక్కడికి వెళ్లినా ఆదరణ, గుర్తింపు లభిస్తుందని ఎంఈవో పి.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న హెచ్‌ఎం షేక్ మహబూబ్‌బాషా, గాదె కోటిరెడ్డి, వై.శివనాగరాజు, జీవి సుబ్బరాజు, మధుసూదన్, బి.భాస్కరరావును శుక్రవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ పువ్వాడి జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సీఎస్‌పురం మండలం ఉప్పలపాడు మండల పరిషత్ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న జేఎస్ ఆనంద్, డి.పున్నమ్మ, కమ్మనేతి వెంకటేశ్వర్లు, ఎల్.ఆంథోని, ఖా రహంతుల్లా, ఎం.రామయ్యను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ నాయబ్‌రసూల్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో పర్సన్‌ఇన్‌చార్జ్ చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, ఎంఈవో ప్రసాదరావు, ఏఎంసీ ఛైర్మన్ మౌలాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

పామూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పొగాకు వేలం కేంద్రంలోనే బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. మండలంలోని కోడిగుంపల, రజాసామేబ్‌పేట, అయ్యవారిపల్లి, బోడవాడ, రేణిమడుగు, అక్కంపేట గ్రామాల్లో ఉన్న బర్లీ పొగాకును శుక్రవారం పరిశీలించి రైతులతో చర్చించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పీసీపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): నివాసప్రాంత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మండలంలోని గుడేవారిపాలెం పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి వీధులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాప్‌మిత్రలు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్తబండి డబ్బాల్లో వేయాలని ప్రజలకు సూచించారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని క్లాప్‌మిత్రలను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనపర్తి శాంసన్, డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): నీటి నిల్వ చేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటే ఎటువంటి రోగాలు దరిచేరవని సబ్‌యునిట్ అధికారి రామాంజనేయులు అన్నారు. సీఎస్‌పురం మండలం అంబవరం, డీజీపేట ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం డెంగ్యూ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ప్రసాదరెడ్డి, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు, పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి తదితరులు

దర్శి, జూలై 18(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు తీవ్రంగా మోసపోయారని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా దర్శిలోని బూచేపల్లి నివాసంలో శుక్రవారం జరిగిన వైసీపీ నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నివర్గాల ప్రజలకు మేలు చేశారని చెప్పారు. వైసీపీ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం అన్నీ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, శ్యామల, బత్తుల బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

తాళ్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈక్రమంలో నాగంబొట్లపాలెంలో పడిన పిడుగుపాటుకు మీసాల నాగమల్లేశ్వరరావుకు చెందిన ఆవు మృతిచెందింది. ఆవు విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఉగ్రను కలిసిన ఈశ్వరయ్య


పీసీపల్లి: ఈశ్వరయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర


వెలిగండ్ల: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కంకణంపాడు టీడీపీ నాయకులు

పీసీపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన పరిమి ఈశ్వరరావు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమిశ్రేణులతో కలిసి కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యేను కలిసి తనను సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఈశ్వరయ్యను ఎమ్మెల్యే ఉగ్ర అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. డాక్టర్ ఉగ్రను కలిసినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, రత్నయ్య, పువ్వాడి నాగరాజు, నాగోతు శ్రీనివాసులు, మూలె బ్రహ్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

వెలిగండ్ల: మండలంలోని కంకణంపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బొప్పరాజు లక్ష్మీనారాయణ వెలిగండ్ల సొసైటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చిలకల కృష్ణారెడ్డి, కంకణంపాడు టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.





వినూత్న ఆలోచనలతో రండి

- పరిశోధనలు, పరిశ్రమలకు ఏపీలో విస్తృత అవకాశాలు
- భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులదే
- జీరో కాలుష్యమే ప్రభుత్వ ధ్యేయం
- పారిశ్రామిక వేత్తలు, కంపెనీల సీఈవో, ఎండీలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తదితరులు

ప్రోత్సాహకాలు అందిస్తాం

గుంటూరు(విద్య), జూలై 18(ఆంధ్రజ్యోతి): నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పరిశోధకులు, పలు కంపెనీల సీఈవోలు, ఎండీలు హాజరయ్యారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడు కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రస్తుతం సిమెంటు, ఉక్కు, ట్రాన్స్ పోర్టు తదితర పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, ఇంధనం సరఫరాకు కాలుష్యం వెదజల్లే ఉద్గారాలను వినియోగించాల్సి వస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. దీని వల్ల కాలుష్యం పెరిగిపోయి.. పర్యావరణం కలుషితం కావడంతోపాటు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని వారికి సూచించారు.

భవిష్యత్తు అంతా గ్రీన్..

ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధనలకు, కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని ఆయన (మిగతా 6వ పేజీలో)

> 'రానున్న రోజుల్లో గ్రీన్ హైడ్రోజన్ విస్తృతంగా వినియోగంలోకి రానుంది. ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వినూత్న ఆలోచనలు, సాంకేతికతతో వచ్చే ఆవిష్కర్తలకు, పారిశ్రామికవేత్త లకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. పరిశ్రమలకు, ప్రాజెక్టులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తాం'
> - సీఎం, చంద్రబాబునాయుడు

గాంధీ జయంతికి.. స్వచ్ఛాంధ్ర బహుమతి!

గాంధీ జయంతికి 'స్వచ్ఛాంధ్ర'ను రాష్ట్ర ప్రభుత్వం బహుమతిగా ఇవ్వనుంది. మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలను పూర్తిగా తొలగించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. వ్యర్థాల నుంచి కూడా సంపద సృష్టించేలా ప్రణాళికాబద్ధంగా ముందు కెళ్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ.. రూ.30.35 కోట్ల నిధులు కేటాయించింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా పనులు చేయిస్తోంది.

- కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకు మోక్షం
- రూ.30.35 కోట్లతో చెత్త శుద్ధి పనులు
- అక్టోబరు 2వ తేదీ కల్లా తొలగింపు దిశగా చర్యలు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు

(అద్దంకి, ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో టన్నుల కొద్ది చెత్త నిల్వలు పేరుకుపోయాయి. వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. రోజూ సేకరించిన చెత్త అక్కడ వేసే పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలో యార్డుల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టి, నిలిపివేశారు. అలాగే పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయి. చెత్త తొలగింపునకు లెక్కలు కూడా నాడు లేవు. కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. స్వచ్ఛాంధ్ర (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేట కంపోస్టు యార్డులో చెత్తశుద్ధి పనులు

మున్సిపాల్టీల వారీగా పేరుకుపోయిన వ్యర్థాలు

మునిసిపాల్టీ	తొలగించనున్న వ్యర్థాలు టన్నుల్లో
చిలకలూరిపేట	1,66,278
నరసరావుపేట	30,609
మాచర్ల	30,894
పిడుగురాళ్ల	10,793
వినుకొండ	11,195
దాచేపల్లి	6,194
గురజాల	1,675
గుంటూరు	43,811
పొన్నూరు	8,376
బాపట్ల	46,264
రేపల్లె	7,203

విషపు రాతలతో దుష్ప్రచారం

- పొగాకు రైతుల్లో భయాందోళనలు
- అసత్య కథనాలు మానుకోవాలన్న సుబ్బారెడ్డి

(బాపట్ల, పర్చూరు, ఆంధ్రజ్యోతి)

కంపెనీల నిరాకరణతో కొనుగోళ్లు లేక అల్లాడుతున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగడంపై పొగాకు రైతుల్లో హర్షం చేస్తున్నారు. అయితే జగన్ పత్రిక విషపు రాతలతో భయాందోళనలు కలిగేలా వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని రైతులు ధ్వజమెత్తుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు మొత్తాన్ని కొనాలని ప్రభుత్వం నిర్ణయించి చర్యలు తీసుకుంటోంది. రెండు నెలల్లో చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. కానీ ఇవేమీ పట్టని జగన్ పత్రిక ప్రభుత్వంపై విషం చిమ్ముతోందని రైతులు విమర్శిస్తున్నారు. కేవలం రైతులను రెచ్చగొట్టేందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉసిగొల్పేందుకు తప్పుడు కథనాలను ప్రచురిస్తోందంటున్నారు. తన పంటను ప్రభుత్వం కొనడం లేదని నిరసిస్తూ ట్రాక్టర్‌తో తొక్కించారంటూ ప్రచురించిన కథనంలో వాస్తవం లేదని పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన బాధిత రైతు గుదిబండి సుబ్బారెడ్డి చెప్తున్నా. స్థానిక ఎమ్మెల్యే బెదిరించారని ఆ పత్రిక నానాయాగీ చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. రైతుల్లో భయాందోళనలు సృష్టించడం, ఏదో జరిగిపోతుందనే తప్పుడు సంకేతాలు పంపించే దిశగా విషపు రాతలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రెండు నెలలు పైనే...

కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు రెండు నెలలుపైనే పడుతుందని, రైతులెవరూ కంగారు పడవద్దని మంత్రి అచ్చెన్నాయుడు మార్టూరు వేదికగా ఇప్పటికే ప్రకటించారు. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలనుకున్నప్పుడే ఆ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై రైతులను అధికారులు చైతన్యపరిచారు. పైగా ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. ఇప్పటికే కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో నగదు జమ కానున్నది. ఇలా రైతులను ఆదుకునే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. రైతులంతా ఒక్కసారిగా కొనుగోలు కేంద్రాల బాట పడితే గందరగోళం నెలకొంటుందని భావించిన అధికారులు సీఎంయాప్‌లో రిజిష్టర్, తర్వాత సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినప్పుడే పంటను నిర్దేశించిన కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేలా చేస్తున్నారు. ఈ ప్రకారం కొనుగోళ్లు జరుగుతున్నాయి. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలనుకున్నప్పుడే ఆ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై రైతులను చైతన్య పరచాలనుకుంది. వెంటనే తమ పంట కొనుగోలు చేయకపోవడంతో కంగారు పడుతున్న రైతులే లక్ష్యంగా వైసీపీ నేతలు, వారి పత్రిక దుష్ప్రచారానికి తెరతీస్తోంది.

నన్నెవరూ బెదిరించలేదు : సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

నన్నెవరు బెదిరించలేదు భయపెట్టలేదు.. జగన్ పత్రిక తప్పుడు కథనాలతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన గుదిబండి సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సాక్షి పత్రికలో వెలువడిన కథనంపై విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మరీ ఆయన మండిపడ్డారు. పాడైన పనికిరాని పొగాకును పొలానికి ఎరువుగా వినియోగించేందుకు తొక్కించానన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్ చేసి తనను పరామర్శించారన్నారు. పనికిరాని పొగాకును మాత్రమే ఎరువుగా వినియోగించానని మిగిలిన పంట అంతా విక్రయానికి సిద్ధం చేసి గోదాములో భద్రపరిచినట్లు తెలిపారు.

పనితీరును వేగవంతం చేయాలి

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు, పనితీరును రెవెన్యూశాఖ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన ప్రసంగించారు. ఈ నెల 23లోపు ఆధార్ వెరిఫికేషన్ వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబం, మార్గదర్శకుల ఎంపిక 25లోపు పూర్తి చేయాలన్నారు. నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని ఆర్డీవోలకు కలెక్టర్ సూచించారు. గ్రామాలవారీగా స్థలాల కేటాయింపునకు అర్హత, అందుబాటులో ఉన్న స్థలాల వివరాలు తెలియజేయాలన్నారు.

102 ఎకరాల భూమికి విముక్తి

20 రోజుల్లో సమస్య పరిష్కారంపై రైతుల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, హాజరైన ముత్తుపల్లి గ్రామ రైతులు

బాపట్ల జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామంలో ఆరు దశాబ్దాలుగా 22ఏలో ఉన్న 102 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గ్రామ రైతులతో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని 87 మందికి రైతువారి పట్టాభూమి కింద పాస్ పుస్తకాలు ఇస్తామని పూర్తి స్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 1987లో పోరంబోకు భూములుగా నమోదు చేశారని దీంతో 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్ళిపోయాయని తెలిపారు. దశాబ్దాల క్రితం దస్త్రాలను పరిశీలించగా ఆ భూములు 87మంది రైతులవని తేలిందన్నారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు తప్పుగా నమోదు చేయడంతో ఆరు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నామని 20 రోజుల క్రితం విన్నవించగా కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించారని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, నిజాంపట్నం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవోకు తూట్లు.. లక్షల్లో వసూళ్లు

నిబంధనలకు విరుద్ధంగా..

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల్లో అక్రమాలు ● వందమందికి సొంత మండలంలోనే పోస్టింగ్

- వేమూరు మండలం వరహాపురం ఏఎన్ఎంను అదే మండలంలోని బలిజేపల్లికి, కుచ్చళ్ల పాడులోని ఏఎన్ఎంను వరహాపు రానికి, పెనుమర్రు ఏఎన్ఎంను జంపనికి మార్చారు.
- చుండూరు మండలం శ్రీరంగపురం నుంచి ఏఎన్ఎంను అదేమండలంలోని వేటపాలేనికి, తొట్టెంపూడి ఏఎన్ఎంను మోదుకూరుకు, అంబేద్కర్‌నగర్ ఏఎన్ఎంను పెనుగుదురుపాడుకి మార్చారు.
- భట్టిప్రోలు మండలం ఐలవరం-1, ఐలవరం-2ల్లోని ఏఎన్ఎంలను అటుఇటు మార్చారు.
- పెదనందిపాడు-1 ఏఎన్ఎంను అదే మండలంలోని వరగానికి, పెదనందిపాడు-2 ఏఎన్ఎంను పెదనందిపాడు-1కు బదిలీ చేశారు. గోగులమూడి ఏఎన్ఎంను సొంత మండలంలోనే నియమించారు.

గుంటూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాజాగా జరిగిన గ్రేడ్-3 ఏఎన్ఎం (యాక్జలరీ నర్స్ ఫర్ మిడ్ వైఫరీ)ల బదిలీల్లో భారీ అక్రమాలు జరిగాయి. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంలు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేందుకు భారీగా ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. అడిగినంత ఇచ్చిన వారి కోసం అధికారులు కూడా జీవో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. అవినీతి వ్యవహారాలు ఆరోగ్య శాఖకు కొత్త కానప్పటికీ ఈసారి మోతదు మరీ పెరిగిపోవడంతో విషయం రచ్చకెక్కింది. జూన్ 12న విడుదలైన జీవో 5 ప్రకారం ఐదేళ్లు దాటిన వారికి కచ్చితంగా స్థానచలనం జరగాలి. ఉద్యోగులను సొంత మండలంలో ఉంచడానికి వీలులేదు. అయితే ఈ నిబంధనను వైద్యఆరోగ్య శాఖలో పక్కన పెట్టేశారు. మొత్తం 977 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించగా వందమందికిపైగా సొంత మండలాల్లోనే నియమించారు. సొంత మండలం దాటితే ఇబ్బందని భావించిన ఉద్యోగులు అక్కడే ఉండేందుకు రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇది గుంటూరులోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు బాగా కలిసి వచ్చింది.

అటెండర్... సూపర్‌వైజర్ హవా..

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలు గుంటూరు డీఎంహెచ్ కార్యాలయంలోని ఓ అటెండర్, ఓ సూపర్‌వైజర్ కనుసన్నల్లో జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఎంతోకాలంగా అక్కడ తిష్ట వేసిన వీరు ముఖ్య అధికారికి, ఏఎన్ఎంలకు మధ్య రాయబేరాలు నడిపినట్లు సమాచారం. సొంత మండలంలో ఉంచడానికి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. నగదు ముట్టజెప్పిన వారికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఖాళీలను బ్లాక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే బదిలీల జాబితాను పదే పదే మార్చినట్లు సమాచారం. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన నియామకాలన్నీ అక్రమంగా జరిగాయని సమాచారం. ఈ అక్రమాలు వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.



వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం

అవీ..ఇవీ..

ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం

అద్దంకి, జూలై18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగించకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. పట్టణంలో ప్రతి రోజు 10 నుండి 20 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ చెత్త వస్తున్నట్లు గుర్తించామన్నారు. పారిశుధ్య కార్యదర్శులతో వీటి వినియోగంతో వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిని వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు చేసే దుకాణాలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయంగా చేలి సంచులను వినియోగించాలన్నారు. మెప్మా సభ్యుల ఆధ్వర్యంలో తయారు చేసేందుకు మున్సిపాలిటీ తరపున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయాల్లో సేవలపై ప్రత్యేక దృష్టి

● మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు



వార్డు సచివాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని అన్ని సచివాలయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ తొలిసారిగా 27వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో కలిసి పరిశీలించారు. ఆ సచివాలయంపై ఇప్పటికే పలుమార్లు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నట్లు వివరించారు. సిబ్బంది ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. చైర్మన్ వెంట కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రవీంద్ర

బల్లికురవ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల సభ్యులతో ప్రతి నెల గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి రుణాలపై అవగాహన కల్పించాలని డీపీఎం రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యలయంలో మండలంలోని అన్ని గ్రామాల పొదుపు సంఘాల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో గ్రుపులో ఉన్న సభ్యులకు గొర్రెలు మేకలు, గేదెలు, కోళ్లు, కిరాణా, టైలరింగ్ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకోనేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలానే పీఎంజీపీ, పీఎంఈ రుణాలకు లబ్ధిదారులను గుర్తించి బ్యాంకులకు పంపించాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్ ప్రతి నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎఫ్‌పీవో ఏపీఎం రవి, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి ఏపీఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి శ్రమించండి

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్



క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న కరణం వెంకటేష్, వైసీపీ నేతలు

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా శ్రమించాలని వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం నేతాజీ యూనియన్ కల్యాణ మండపంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమాభివృద్ధిలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈక్రమంలో కార్యకర్తలు వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం పేరాల గోలిసదాశివ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు రైతులు నిబంధనలు పాటించాలి

● ఆర్‌ఎం రామారావు



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం రామారావు

ఒంగోలు(రూరల్), జూలై18(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సాగు చేసే రైతులు బోర్డు నిబంధనలు తప్పక పాటించాలని ఆర్‌ఎం శీలం రామారావు కోరారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో శుక్రవారం జరుగుతున్న వేలం ప్రకియను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది కొంతమంది రైతులు ఒక బ్యారన్‌కు సాగు చేయాల్సిన పొగాకు పంటను సుమారు నాలుగు బ్యారన్‌లకు సరిపడ స్థాయిలో సాగు చేశారని చెప్పారు. 166 మిలియన్‌ల కిలోల ఉత్పత్తికి రైతులకు అనుమతి ఇస్తే ఏకంగా 240 మిలియన్‌ల కిలోల పొగాకు ఉత్పత్తి చేశారని, దీంతో అమ్మకాల ప్రక్రియలో ఇబ్బందికరమైన పరిస్థితి వచ్చిందన్నారు. దీనికితోడు పెట్టుబడులు కూడా పెరగడంతో రైతుకు వచ్చే ఆదాయాలకు గండి పడిందని పేర్కొన్నారు. అధి కంగా పొగాకు పంట సాగు చేయటంతో వ్యాపారులు కొనుగోలు చేసిన ప్పటికీ గోదాముల్లో బేళ్లు స్టాకు చేసుకోవటం కూడా ఇబ్బందిగా మారింద న్నారు. ముఖ్యంగా కౌలు రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే నష్టాల కు గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పొగాకు అంతర్జాతీయ మార్కెట్ పంట అని, ఏ దేశంలో పొగాకు తక్కువ ధరకు వస్తుందో వ్యా పారులు అక్కడే కొంటారని తెలిపారు. ఈ ఏడాది పొగాకు నారుమడులు అవసరం మేరకు మాత్రమే సాగు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జె.తులసి, రైతు నాయకులు పెనుబోతు సునీల్, క ట్టా హనుమంతరావు, వైవీ.శేషయ్య, రైతులు పాల్గొన్నారు.







చెరువును తలపిస్తున్న కోటపాడు ఉన్నత పాఠశాల ప్రాంగణం, అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

ప్రభుత్వ కార్యాలయాలు జలమయం



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

అద్దంకి,జూలై18(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రారంభమైన వర్షం శుక్రవారం ఉదయం వరకు కురిసింది. వర్షాలు పడాల్సిన సమయంలో ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఒకింత ఉపశమనం కలిగింది. అద్దంకిలో 6.26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నీటి కుంటలను తలపించేలా వర్షపు నీరు నిలిచింది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో బోరు బావుల కింద సాగు చేసిన మొక్కజొన్నకు ప్రస్తుత వర్షం జీవం పోసినట్లు అయ్యింది. దీంతో రైతులు ఊపిరిపీల్చు కు న్నారు. మెట్ట పంటలు సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

పంగులూరు : మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షపు నీరుచేరి చెరువును తలపిస్తోంది. పాఠశాల భవనంతో పాటు ప్రాంగణం రోడ్డుకన్నా పల్లంగా ఉండడంతో వర్షపు నీరు బయటకు పోయే పరిస్థితిలేదు. గతంలో ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న ఈ పాఠశాల నేడు 185 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులతో ఉన్నత పాఠశాలగా రూపుదిద్దుకొంది. 1 నుండి 9వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలకు సరిపడా తరగతి గదులు లేని పరిస్థితి. వర్షం పడితే ఉపాధ్యాయులు, విద్యార్థులు నీటి మడుగులో అడుగులు వేస్తూ, తరగతి గదిలోకి అడుగుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు తగినన్ని తరగతి గదులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వెంటాడుతున్న పంచాయతీ కార్యదర్శుల కొరత

- పది పంచాయతీలకు ఇన్‌చార్జులే దిక్కు
- పడకేసిన పారిశుధ్యం
- పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు



ముక్తేశ్వరం సచివాలయం

బల్లికురవ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ సచివాలయానికి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాల్సి ఉన్నా, బల్లికురవ మండలంలో మాత్రం పంచాయతీ కార్యదర్శుల కొరత ప్రజలకు తీవ్ర ఇబ్బంది పెడుతుంది. సాధారణ బదిలీలో ఖాళీగా ఉన్న గ్రామాలకు కార్యదర్శులు వస్తారు అని అనుకొంటే ఎవరు రాలేదని, దీంతో ఉన్న కార్యదర్శులకు రెండు మూడు చొప్పున ఇన్‌చార్జులుగా నియమిం చారు. దీంతో కార్యదర్శులు విధులు సక్రమం గా నిర్వహించలేకపోతున్నారు. గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. రోడ్ల వెంబడి వ్యర్థాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. వచ్చే వర్షాకాలంలో ఇలా అయితే అంటువ్యాధులు ముప్పు పొంచి ఉందని ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. బల్లికురవ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా పదిమంది కార్యదర్శులు మాత్రమే విధులలో ఉన్నారు. బల్లికురవ, గుంటుపల్లి, వల్లాపల్లి, అంబడిపూడి, వైదన, కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, మల్లాయ పాలెం, చెన్నుపల్లి, కొప్పెరపాడు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 11 గ్రామాలలో ఉన్న కార్యదర్శులకే మిగిలిన గ్రామాలకు ఇన్‌చార్జులుగా నియ మించారు. దీంతో ఇన్‌చార్జి కార్యదర్శులు సకాలంలో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టలేక పోతున్నారు. గ్రామాలలో ఎక్కడ చూసిన పారిశుధ్యం పడక వేసి ఉంది. రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్దఎత్తున ఉన్నాయి. రోడ్ల వెంట వెళుతుంటే వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండల కేంద్రమైన బల్లికురవకే పంచాయతీ కార్యదర్శి లేక పోవడంతో పారిశుధ్య పనులు చేయడం లేదని ప్రజలు అంటున్నారు. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో అయితే వ్యర్థాలను ప్రజలు రోడ్ల మీదే పడవేసి పోతున్నారని అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో గ్రామాలలో ప్రభుత్వం ద్వారా వచ్చే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని నీటి పన్నులు, ఇంటి పన్నుల వసూళ్లు కూడా చేయటం లేదని దీంతో పంచాయతీల ఖజానా కాళీగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న కార్యదర్శుల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరి రైతులకు మూడు నెలలైనా అందని నగదు

కొత్తపల్లి సర్పంచ్ బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

చినగంజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వరిరైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చి మూడు నెలలు దాటినా ఇప్పటికి వరకు వారి సొమ్ము ఎందుకు జమజేయలేదని కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి ఏవో ఆర్.చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి త్వరలో రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేట్లు చేస్తామని ఏవో తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను తొలగించాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ సమావేశం దృష్టికి తెచ్చారు. గ్రామంలోని ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు లేరని, పంచాయతీ అనుమ తులు లేని ప్రైవేటు పాఠశాలకు ఎలా అనుమతులు ఇచ్చారని కొత్తపాలెం గ్రామ సర్పంచ్ సభ దృష్టికి తెచ్చారు. ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగిస్తామని, ప్రైవేటు పాఠశాల పరిస్థితులపై జిల్లా కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్.విజయ, ఎంఈవో అజయ్ బాబులు తెలిపారు. చింతగుంపల్లె గ్రామంలో ఐదారు సంవత్సరాల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం అసాంఘీక కార్యకలాపాలకు నిలయం గా మారిందని ఉపాధ్యక్షులు బాబురావు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తే భవనానికి సంబంధించిన పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. మోటుపల్లి సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ పంచాయతీ పరిధిలో గృహలబ్ధిదారుల వద్ద నుండి సిమెంట్ తక్కువ ధరకు ఇప్పిస్తామని, మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి వద్ద డబ్బులు వసూలు చేస్తున్న ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు అధికారుల దృష్టికి తెచ్చారు. డిజిటల్ అసిస్టెంట్ వద్ద నుండి డబ్బులు రికవరీ చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఎంపీపీ ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌లకు సూచించారు. మండల పరిధిలో అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదా రుల జాబితాలోని రైతుల ఆధార్‌కార్డుల్లో తప్పులు సరిచేసుకోవాలి తహసీల్దార్ జె.ప్రభా కరరావు తెలిపారు. పశుసంవర్థక, ఇరిగేషన్, డ్రైనేజీ, అటవీ, ఎక్సైజ్, మత్స్య, ఆర్టీసీ, ఉద్యానవన శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్‌ను నిర్వీర్యం చేసే విధానాలను రద్దు చేయాలి

● ఒంగోలులో ఉద్యోగుల నిరసన



ధర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఉద్యోగుల భద్రతకు భంగం వాటిల్లే విధానాలను వెంటనే రద్దు చేయాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో), నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌యూపీఈ జిల్లా సెక్రటరీ సిద్ధయ్య మాట్లాడుతూ పోస్ట్‌మెన్‌లకు ఈ-బైక్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెలివరీ సెంటర్ పేరును పోస్టల్ డెలివరీ సెంటర్‌గా మార్చాలని, వాటిలో హెడ్‌పోస్టాఫీస్‌లలో పనిచేస్తున్న వారిని నియ మించాలని కోరారు. 2010, 2012 ఎస్టాబ్లిష్ మెంట్ నిబంధనల ప్రకారం పోస్ట్‌మ్యాన్‌లకు బీట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని డెలి వరీ సెంటర్‌లో కనీస వసతులు కల్పించడంతోపాటు తపాలా శాఖ ద్వారానే మొబైల్ ఫోన్ లు అందించాలని చెప్పారు. ముఖ్యంగా అందరి కీ మెడికల్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కల్పిం చాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ అసి స్టెంట్ సెక్రటరీ పి.క్రాంతికుమార్, డివిజన్ ప్రె సిడెంట్ ఎస్.రామాంజనేయులు, కోశాధికారి పి.మోహన్‌రావు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, లక్ష్మయ్య, బ్రహ్మతేజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో రండి!

(5వ పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది శ్రీకారం చుట్టనుందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైందని, ఇందులో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగా వాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రో లైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు 1000 కిలోమీటర్ల కోస్తా తీరం, నీరు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి గ్రీన్ ప్రాజెక్టులు పనిచేసే స్థాయి రావాలని చంద్రబాబు అభిలాషించారు.

రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్‌ఏహెచ్ ఇన్‌ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలోటన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు రూ.35 వేల కోట్లను పెట్టుబడి పెట్టనుందని ముఖాముఖి తర్వాత జరిగిన సదస్సులో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముఖాముఖి సదస్సులో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.జయానంద్, ఎస్ఆర్‌ఎం వర్సిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌కే మల్హోత్రా, నేషనల్ కెమికల్ ల్యాబ్(పూనే) డైరెక్టర్ డాక్టర్ ఆశీస్ లేలే, నెడ్ క్యాప్ రాష్ట్ర అధికారి డాక్టర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల పరిశీలన



విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, జూలై18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించేందుకు, గృహాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వేర్వేరుగా కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని కుంకుపాడు లో జరుగుతున్న విద్యుత్ పనులను శుక్రవారం ఈఈ మస్తాన్‌రావు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. రూరల్ ఏఈ శివప్రసాద్, సర్పంచ్ గాలం శ్రీనివాసరావు, లైన్‌మెన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారించాలని లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక తరపున రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో పోరాటాల్లో పాల్గొని నిరసన తెలియజేస్తామని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని అద్దంకిలోని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఐక్యవేదిక కోశాధికారి చెన్నుపల్లి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు తదితరులు మద్దతు సమ్మెకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదాం, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వి. జాను, ఉసురుపాటి శామ్యూల్, కె. మారుతి, జి.మార్కు, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

● ఏపీఎంఐసీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ జెన్నమ్మ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం పై పూర్తి స్థాయిలో అవ గాహన పెంచుకోవాలని ఏపీఎంఐసీ ప్రాజెక్టు అసి స్టెంట్ డైరెక్టర్ పి.జెన్నమ్మ సూచించారు. శుక్ర వారం ఒంగోలులోని ఏపీ ఎంఐసీ కార్యాలయంలో సంబంధిత ఉద్యోగులకు సమాచార హక్కు చ ట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం కింద దరఖాస్తు వస్తే అందుకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ యా దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబం ధిత అధికారులపై ఉంటుందన్నారు. అందుకోసం చట్టంపై అవగాహన పెం చుకుని దరఖాస్తుదారునికి సకాలంలో సమాచారం ఇవ్వాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ జయంతికి.. 'స్వచ్ఛాంధ్ర' బహుమతి!

(5వ పేజీ తరువాయి)

కార్పోరేషన్ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో చెత్త శుద్ధికి రూ.30.35 కోట్లు నిధులు విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ ద్వారా మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీ కల్లా వ్యర్థాలను తొలగించే దిశగా పనులు నిర్వహిస్తున్నారు.

3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పోరేషన్, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల కార్పోరేషన్ సహా మొత్తం 11 చోట్ల పనులు జరగుతున్నాయి. 3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ఎరువుగా మర్చే ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు సంబంధించి యార్డుల్లోనే యంత్రాలను ఏర్పాటు చేశారు.

వ్యర్థాల తొలగింపు ఇలా..

రెడ్‌బీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెత్త తొలగింపు పనులను స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ అప్పగించింది. చెత్తలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను వేరు చేసి అవసరమైన కంపెనీలకు తరలిస్తారు. వ్యర్థాల్లో వస్త్రాలు, మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను యంత్రాల ద్వారా వేరు చేస్తారు. ఇలా వచ్చే మట్టిని మునిసిపాల్టీల్లో లోలెవల్ ప్రాంతాలకు వినియోగించనున్నారు. మొత్తం మీద మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల వద్ద రహదారులపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా శుభ్ర పరచనున్నారు. వ్యర్థాలను యార్డులకు తరలించే పరిస్థితి లేక.. రహదారుల మార్జిన్‌లలో తగలబెట్టె పరిస్థితి కూడా ఇక ఉండదు. ఇక మీదట తడి పొడి చెత్తను కచ్చితంగా వేరు చేయాలని మునిసిపాలిటీలను స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆదేశించింది. ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పతి ప్లాంట్‌లకు తరలించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు జరిగితే పట్టణాల్లో పరిశుభ్రత నెలకొనే అవకాశం ఉంది.

అవీ..ఇవీ..

రేపు కౌలురైతు సంఘం జిల్లా మహాసభలు

పర్చూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఈ నెల 20న కౌలురైతు సంఘం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు రైతుసంఘం నాయకులు కొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం రైతు సమస్యలపై కౌలు రైతుసంఘం విశేష కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా గత సంవత్సరం కొమ్మమూరు కాలువలో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అప్పటి ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించి వారబంధి విధానం ద్వారా నీటిని ఇప్పించిన ఘనత కౌలు రైతు సంఘానికే దక్కుతుందని ఆయన అన్నారు.

పావులూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రాంబాబు ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న చైర్మన్ నారిశెట్టి రాంబాబు

ఇంకొల్లు, జూలై 18,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పావులూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఆ గ్రామానికి చెందిన నారిశెట్టి రాంబాబు ప్రమాణస్వీకారం చేశారు. పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరుకాగా సహకార సంఘ బ్యాంకు అధికారులు విజయలక్ష్మీ, సుభాని, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చైర్మన్‌గా రాంబాబు, డైరెక్టర్లు కామేపల్లి తాతారావు, గుంజి నాగేశ్వరరావులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్ కరి శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావు, పావులూరు సర్పంచ్ బి.లూథియమ్మ, తన్నీరు రామాంజనేయులు, బట్టు శ్రీనివాసరావు, రవి, వెంకటేశ్వరావు, మాధవరావు, పోలయ్య, అన్నెం వెంకట్రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

పంగులూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరులో ఈ నెల 20న ఆదివారం ఉపాస్ వైద్యశాల ఒంగోలువారి సహకారంతో ఉచితమెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సాధారణ, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధులు, కంటివ్యాధులతో పాటు థైరాయిడ్, ఆయాసం, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. పంగులూరు పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని రామాంజనేయులు కోరారు.

తరగతి గదుల కోసం స్థలం పరిశీలన



గదుల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పంగులూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లంవారిపాలెం గ్రామంలో పాఠశాల నూతన గదుల నిర్మాణం కోసం మండల అధికారులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు, వర్షం పడితే కురుస్తుడటంతో నూతన గదుల నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. పాఠశాల గదుల దుస్థితి గురించి గ్రామస్థులు, ఉపాధ్యాయులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎంఈవో వీరాంజనేయులు, గ్రామపెద్దలు సుబ్బారెడ్డి, చినాదిరెడ్డి పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం భద్రం



ఔషద మొక్కలు నాటుతున్న ఎంఈవో 2 శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మన పూర్వీకులు ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచుకునేందుకు ప్రకృతి సిద్ధమైన ఔషద మొక్కలను నిత్య జీవితంలో భాగంగా చేసుకున్నారని ప్రతి ఒక్కరు ఔషద మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని, ఎంఈవో-2 శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవాసంస్థ నేషనల్ మెడిసినల్ ప్లాంట్ బోర్డ్ సహకారంతో 2025-26 సంవత్సరానికి పాఠశాలలో ఔషద మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఎంఈవోతో కలిసి 30 రకాల ఔషద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఔషద మొక్కల ప్రాధాన్యతను సంస్థ అధ్యక్షుడు బత్తుల కిరణ్ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి. గంగాధరరావు, సీఆర్‌పీ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



పెదగంజాంలో సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చినగంజాం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్ణంగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.పాపారావులు ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ నాయకులు శుక్రవారం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, పాఠశాలల్లోని సమస్యలను తెలుసుకొన్నారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, షేక్.నాయుబ్‌రసూల్, సీ.హెచ్.వెంకట్, జి.రాంబాబు, సీ.హెచ్.కుమార్, మధు, కే.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- అద్దంకి పట్టణం లో 15.52 కోట్ల రూపాయలతో విద్యుత్ అభివృద్ధి పనులు
- కొత్తగా రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- కొత్తగా విద్యుత్ తీగల ఏర్పాటు
- మరో మూడు దశాబ్దాల పాటు సమస్యలు లేకుండా చర్యలు

అద్దంకి,జూలై18(ఆంధ్రజ్యోతి): 'తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పిల్లలు చదువుకోలేకపోతున్నారు. రాత్రివేళలో పసిపిల్లలు గోలపెడుతున్నారు.' ఈ మాటలు అద్దంకి పట్టణంలో ఇకపై పెద్దగా వినిపించకపోవచ్చు. మరో 30 సంవత్సరాలు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, పాత తీగల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం వంటివి ప్రభుత్వం చేపడుతోంది. ప్రస్తుతం పనులు చేపడుతున్న దృష్ట్యా కొన్నిసార్లు సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నా, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రణాళికా బద్ధంగా ముందుకు పోతున్నారు. ఆ మేరకు అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిశానిర్దేశం చేస్తున్నారు.



ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

పట్టణంలో ఏడాది కాలంలో చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న విద్యుత్‌శాఖ పనులు పరిశీలిస్తే సుమారు రూ.15.52 కోట్లతో వివిధ రకాల పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సుమారు రూ.11.23 కోట్లతో ఎన్ఎస్‌పీ కాలనీ, ద్వారకానగర్‌లలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, నాలుగు సబ్‌స్టేషన్లను అనుసంధానం చేసే విద్యుత్ టవర్ లైన్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. పలు కాలనీలలో అద్దంకి పట్టణానికి విద్యుత్ సరఫరా జరిగిన తొలినాళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల ఆధారంగా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు.ఆయా కాలనీలలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు కూడా చేయించారు. ఇప్పటికే వెయ్యికి పైగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. లో-ఓల్టేజ్ సమస్య నుంచి అధిగమించేందుకు 5 చోట్ల 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 5, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 2 అదనంగా ఏర్పాటు చేశారు. ఇక కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు సింగిల్ ఫేజ్ స్థానంలో 5 వైర్లుతో త్రీ ఫేజ్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పెద్ద ఎత్తున విద్యుత్ శాఖ అభివృద్ధి పనులు చేస్తుండటంతో, కొంత కాలంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది.



అద్దంకి పట్టణంలో ఏర్పాటు చేస్తున్న టవర్లు

అయినప్పటికీ, భవిష్యత్తులో మరో మూడు దశాబ్దాల పాటు ఎలాంటి విద్యుత్ సమస్య లేకుండా పనులు చేపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కూడా స్థానికంగా ప్రజలను సమన్వయం చేసుకుంటూ పనులు చేస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా బోడవాడ రోడ్డు

రహదారి నిర్మించిన కొద్దికాలానికే మరమ్మతులు

పర్చూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సడక్ యోజన ద్వారా నిర్మించిన రహదారి కొద్దికాలానికే దెబ్బతినడంలో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో నాణ్యతలు పాటించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద పర్చూరు మండలంలోని బోడవాడ - రమణాయపాలెం మధ్య 6 కిలోమీటర్ల మేర రూ.3.20 కోట్లతో మూడేళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. గతంలో పర్చూరు నుంచి జిల్లా కేంద్రం బాపట్ల వెళ్లేందుకు వీరన్నపాలెం, పోతుకట్ల, కొమర్నేనివారిపాలెం, రమణాయపాలెం గ్రామాల మీదుగా చెరుకూరు వెళ్లి అక్కడ నుంచి వెళ్లేవారు. పాత చెన్నై రోడ్డు నుంచి బోడవాడ మీదుగా రమణాయపాలెం రహదారి అభివృద్ధి చేయగా నేరుగా చెరుకూరు నుంచి బాపట్ల జిల్లా కేంద్రానికి వెళ్లే అవకాశం ఏర్పడింది. దీంతో దాదాపు 8 కిలోమీటర్ల మేర దూరం దక్కింది. ఇంతటి ఉపయోగకరంగా ఉన్న రహదారిని కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసినా నిర్వాహణా లోపం కారణంగా నిర్మించిన కొద్దినెలలకే దెబ్బతినడం అధికారుల పర్యవేక్షణా లోపానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. రోడ్డు అధ్వానంగా మారి దెబ్బతిని రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతున్నా సదరు గుత్తేదారు నుండి మరమ్మతులు చేయించడంలో అ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కూడా ముంచుకొస్తుండడంతో ఈ రోడ్డు మరింతగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడు తుందని వాహనదారులు ప్రజలు పేర్కొంటు న్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు ఈరోడ్డు పరిస్థితిపై దృష్టిసారించి మరమ్మ తులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బోడవాడ - రమణాయపాలెం మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాదర్బార్‌తో సమస్యలకు చక్కని పరిష్కారం

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజాదర్బార్‌తో ప్రజల సమస్యలకు చక్కని పరిష్కారం దొరికే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పెన్షన్ల కోసం 45, నివేశన స్థలాలు 165, 10 ఇతర అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందిన ప్రతి అర్జీ పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే కొండయ్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. అలాగే ఆస్పత్రికి ఇప్పటికే రూ.23.70 కోట్లు నిధులు మంజూరు చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ శంకుస్థాపనకు మంత్రిని ఆహ్వానించారు. అలాగే వైద్యశాల మరమ్మత్తులతో పాటు కొన్ని ముఖ్య సమస్యలపై సుదీర్ఘంగా మంత్రితో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచాలి

రైతుసంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి నాగబోయిన రంగారావు

పంగులూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు రైతులు కష్టాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లలో వేగం పెంచాలని, రైతుసంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. రోజుకు 50 మంది రైతుల నుంచి వెయ్యి బేళ్లు కొనుగోలు చేయాలని, పొగాకు అమ్మిన రైతుల ఖాతాలలో వెంటనే నగదు జమచేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబోయిన రంగారావు మాట్లాడుతూ పంగులూరు మండలంలో ఐదు వేల ఎకరాలలో నల్లబర్లీ సాగు చేశారన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పండించిన పొగాకు ప్రస్తుతం మండెల రూపంలో నిల్వ ఉందన్నారు. ప్రభుత్వం మొక్కుబడి గా కాకుండా రైతులకు మేలు చేసే దృక్పథంతో కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. రైతుల వద్ద మండలంలో 50 వేల క్వింటాళ్ల పొగాకు ఉండగా, రోజువారీ కొనుగోళ్లు వందల సంఖ్యలో ఉంటున్నాయన్నారు. ఇలా అయితే ఎన్నాళ్లకు కొనుగోళ్లు పూర్తవుతాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రామారావు ప్రశ్నించారు. మార్కెట్‌యార్డ్‌లోని గోడౌన్లు నేడో రేపో నిండే పరిస్థితి ఉందన్నారు. కొనుగోళ్ల సాంద్రత పెంచకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఆ మేరకు తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాయిణి వినోద్‌బాబు, మల్లారెడ్డి, ప్రభాకర్, సురేష్, కృపారావు, సింగారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నాగబోయిన రంగారావు

ఉపాధి పనుల తనిఖీకి సహకరించాలి

బల్లికురవ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీకి ప్రజలు, అధికారులు సహకరించాలని ఆడిట్ టీం ఎస్ఆర్‌పీ తులసి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో పాండు రంగస్వామి అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారులు మాట్లాడుతు గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన 645 పనులకు సంబంధించి ఖర్చు చేసిన రూ.12 కోట్లు నిధులపై గ్రామాలలో తనిఖీలు చేపట్టి కూలీలతో గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు కూడా ఎక్కడైన అవకతవకలు జరిగితే వెంటనే తనిఖీ బృందాలకు తెలియజేయాలన్నారు. అవినీతిని వెలికి తీసేందుకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ తులసినాయక్

గంజాయి రక్కసిపై కలిసికట్టుగా పోరాడుదాం..

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, తదితర మత్తు పదార్థాలపై కలిసికట్టుగా పోరాడదామని టూటౌన్ సీఐ నాగభూషణం అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాలలో మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. అలాగే రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో వాడరేవు జడ్పీ హైస్కూల్లో శక్తియాప్, ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ నాగభూషణం

లభించని మృతుని ఆచూకీ

యద్దనపూడి, (మార్టూరు)జూలై18(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై యద్దనపూడి మండల పరిధిలో సూరవరపుపల్లి గ్రామ సమీపంలో ఈ నెల 14న సోమవారం రాత్రి పోలీసులు గుర్తి తెలియని మృతదేహాన్ని గుర్తించిన సంగతి తెలసిందే. అయితే ఆ వ్యక్తికి సంబంధించిన సమాచారం లభ్యం కాలేదని శుక్రవారం ఎస్ఐ టి.రత్నకుమారి తెలిపారు. దీంతో మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచిన ఆయన మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

తెగిన విద్యుత్ తీగలు.. తప్పిన ప్రమాదం

ఇంకొల్లు, జూలై 18, (ఆంధ్ర జ్యోతి) : ఇంకొల్లు - కడవకుదురు రోడ్డు లోని ఫౌండ్రీల వద్ద గురువారం రాత్రి విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. భారీ గా ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వైర్లు తెగాయి. అధికారు లు వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి మరమ్మతులలు చేపట్టారు. గురువారం వేకువజామున కురిసిన వర్షానికి రోడ్లు జలమయమైయ్యాయి.



తెగిపడిన విద్యుత్ వైర్లు

దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న మండల విద్యాశాఖాధికారులు

చినగంజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-1, 2లు బి.అజయ్‌బాబు, ఎన్.కోటేశ్వరరావులు సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో జిల్లా సమగ్రశిక్ష వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందజేసిన వివిధ రకాల ఉపకరణాలను శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా సమగ్ర శిక్ష వారు రూ.57,000ల విలువైన ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను అందజేసినట్లు ఎంఈవోలు తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న ముగ్గురు విద్యార్థులకు ట్రై సైకిళ్లు, ముగ్గురికి వినికిడి యంత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు టి.బాలకృష్ణ, డి.నాగార్జున, బి.సుబ్బరాజు, సీఆర్పీలు ఎన్.సునీల్, రామకృష్ణారెడ్డి, అశీష్‌కుమార్, ఎంఐఎస్ ఎం.మురళి, డేటా ఆపరేటర్ మురళికృష్ణారెడ్డి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి కీర్తి సరోజ్

చినగంజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో శుక్రవారం నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. 104 వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై అవగాహక కల్పించి, తగు సూచనలు, జాగ్రత్తలు అందజేశారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పలు వ్యాధులకు సంబంధించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తదనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో 104 డి.ఎం. జె.నాగేశ్వరరావు, 104 డీఈవో పాదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం ఎం.శారద, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీ4పై అవగాహన

యద్దనపూడి,(మార్టూరు)జూలై18(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామ సచివాలయపరిధిలో 105 బంగారు కుటుంబాలును గుర్తించినట్లు ఎంపీడీవో మహమ్మద్ అఖీబ్ జావెద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతవరం గ్రామంలో పీ4పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ అనంతవరం గ్రామ సచివాలయపరిదిలోని అనంతవరం గ్రామంలో 84 కుటుంబాలు, సూరవరపుపల్లి గ్రామంలో 21 కుటుంబాలును బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా 10 మందిని మార్గదర్శకులుగా ఎంపికచేశామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ టి.కృష్ణ పంచాయతీ కార్యదర్శి డి మోహనబాబు, సూరవరపుపల్లి పంచాయతీ కార్యదర్శి యం తేజశివప్రసాద్, గ్రామ నాయకులు గుదే తారకరామారావు, కొర్రపాటి వంశీకృష్ణ, కోయసతీష్, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, మానకొండ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

వాడరేవు (చీరాల), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలోని 430 మంది విద్యార్థులకు రోటరీక్లబ్ ఆఫ్ చీరాల ప్రతినిధులు రూ.28 వేల విలువైన నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, వివిధ పాఠ్యసామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బాల్యం నుంచే లక్ష్యాలపై గురి పెట్టుకోవాలని సూచించారు. తద్వారా ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, కృష్ణమూర్తి, లక్ష్మీ ప్రతాప్, హేమంత్‌కుమార్, మోహన్‌రావు, సురేష్, అప్పారావు, రాఘవరావు, శ్రీనివాసబాబు, డా.బాబురావు, పుల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సూపర్‌సిక్స్ పథకాలు అమలు

అద్దంకి, జూలై18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోందని నియోజకవర్గ టీడీపీ సమన్వయం కమిటీ సభ్యుడు చుండూరి మురళీసుధాకర్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో శు క్రవారం టీడీపీ నేతలు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో అమలు చేయనున్న పథకాలను వివరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 19 జూలై 2025



శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆషాఢ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి, ఆలయానికి 10 టన్నుల కూరగాయలు, పండ్లతో వైభవంగా అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ కోటా గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముగం, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మెమో 57ను అమలు చేయాలి

నెల్లూరు (విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మెమో 57ను అమలు చేసి పాత పెన్షన్ అమలు పరచాలని ఉపాధ్యాయుల ఫోరం నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం 2003 ఉపాధ్యాయుల ఫోరం నేతలు దర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1-9-2004 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై ప్రభుత్వ పరిపాలన కారణాలతో 2009, సెప్టెంబరు 1 తరువాత నియామకాలు పొందిన ఉపాధ్యాయులకు, ఇతర ఉద్యోగులకు పాత పెన్షన్‌ను వర్తింప చేయాలన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను ఏపీలోనూ అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ నిరసనలో ఫోరం కన్వీనర్లు కృష్ణయ్య, ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నేతలు చలపతిశర్మ, బాబురెడ్డి, దశరథరాములు, హజరత్, సుబ్బు, వేణుగోపాల్, పిచ్చిబాబు, అనిల్‌కుమార్, ఖాజా రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన ఉపాధ్యాయులు

801 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

నెల్లూరు (వ్యవసాయం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం 801 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లావ్యాప్తంగా వివిధ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలకు తరలించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 40వేల మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని పేర్కొన్నారు. బుచ్చి, అల్లూరు, దగదర్తి, ఇందుకూరుపేట, కలువాయి, కోవూరు నెల్లూరు, పొదలకూరు, టీపీ గూడూరు, వెంకటాచలం, వలేటివారిపాళెం మండలాల్లోని 18 సొసైటీలకు 317.475 మెట్రిక్ టన్నులు పంపామని తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, కలువాయి, సంగం, బుచ్చి, పొదలకూరు, మనుబోలు మండలాల్లోని 28 రైతు సేవా కేంద్రాలకు 483.525 మెట్రిక్ టన్నులు మొత్తంగా 801 మెట్రిక్ టన్నులను రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు.

స్థానిక సంస్థలకు ప్రాధాన్యత



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, తదితరులు

- గత ప్రభుత్వంలోలా ఆర్థిక సంఘం నిధులు లాక్కోలేదు
- రూ.62.22 కోట్లు జమ చేశాం! • గతంలో జడ్పీటీసీలు ఎందుకు ప్రశ్నించలేదు?
- అధికారులు సరైన సమాచారంతో రాకపోతే సహించేది లేదు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఆనం ఘాటు వ్యాఖ్యలు

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : 'గత పాలన తీరు వేరు. నేటి పాలన తీరు వేరు. ఈ ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. గతంలోలా పంచాయతీల నిధులను లాగేసుకోవడం లేదు. ఏడాది కాలంలో జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.62.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేసింది' అని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శుక్రవారం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రి ఆనం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జడ్పీ మాజీ చైర్మన్ బాలచెన్నయ్య మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం అరుణమ్మ సమావేశాన్ని ప్రారంభించగా, పంచాయతీ రాజ్, డ్వామా, డీఆర్‌డీఏ, విద్యా, విద్యుత్ శాఖలపై సమీక్ష జరిగింది. పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించారు. 30 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వలేదని, జడ్పీ జనరల్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు కూడా పలు అంశాలపై మాట్లాడటంతో వాటిని పరిష్కరించాలని మంత్రి, కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. చివరగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. గౌరవ వేతనాన్ని జనరల్ ఫండ్ కింద చెల్లించి, తిరిగి రీయింబర్స్ చేసుకునే అవకాశం ఉన్నా జడ్పీ అధికారులు ఎందుకు అలా చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు గౌరవ వేతనం గురించి మాట్లాడుతున్న జడ్పీటీసీలు.. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల నిధులు, అధికారాలు లాగేసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తాము స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అనుకుంటే, వారికి సమాధానం కూడా అంతే కరుగ్గా వస్తుందని ఆనం వ్యాఖ్యానించారు. జిల్లాస్థాయి సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని, ఇకపై అలా రాకపోతే ఉపేక్షించేది లేదని కలెక్టర్‌కు సూచించారు. గత ప్రభుత్వ పుణ్యమా అంటూ రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులు రద్దయ్యే ప్రమాదం వచ్చిందని, కానీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడి మరో రెండేళ్ల సమయం పొడగించుకున్నారని మంత్రి వెల్లడించారు.



ఖాళీగా ఉన్న ఎమ్మెల్యేల కుర్చీలు

• కుదరదు.. ఇవ్వాల్సిందే..

వెంకటగిరి నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఎంపీడీవో కార్యాలయ భవనాల విషయంలో ఆసక్తికర చర్చ జరిగింది. గతంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండలాల్లో శిథిలావస్థలో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించేందుకు జడ్పీ నిధులతో అనుమతులు మంజూరు చేశారని, వాటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని ఆయా జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. మిగిలిన నిధులు మంజూరు చేస్తే భవనాలు పూర్తవుతాయని కోరారు. కానీ వీరి విన్నపాన్ని చైర్‌పర్సన్ అరుణమ్మ తిరస్కరించారు. నిధులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. అయితే నిధులు ఇవ్వలేం అనడం సరైన సమాధానం కాదని మంత్రి ఆనం అన్నారు. పెండింగ్ నిధులను విడుదల చేయాలని ఆదేశించారు. అలానే ఇంతకాలం ఆ భవనాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారో కలెక్టర్‌కు వివరణ పంపాలని జడ్పీ సీఈవోకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్

• లోకేష్‌కు ధన్యవాదాలు

పేద విద్యార్థుల కోసం తల్లికి వందనం గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యాశాఖ

- మిగతా 7లో

కాంట్రాక్ట్ అధ్యాపకుల గడువు పునరుద్ధరణ

- వివరాలు 8లో

6 నెలల్లో గ్రంథాలయ సెస్సులు చెల్లించాలి

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థకు మున్సిపాలిటీలు చెల్లించాల్సిన సెస్సు బకాయి రూ.40కోట్లను 6 నెలల్లో పూర్తిగా చెల్లించాలని జిల్లాలోని మున్సిపాలిటీల కమిషనర్లను గ్రంథాలయ చైర్‌పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వారి సమస్యలు, గ్రంథాలయ పరిస్థితులు, జీతభత్యాలు, పెన్షన్లు తదితర అంశాలపై చర్చించారు. సెస్సు బకాయిలపై మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడారు. ఇక నుంచి ప్రతీ సోమ

• మున్సిపల్ కమిషనర్లకు జేసీ ఆదేశాలు

వారం జిల్లా పంచాయతీ అధికారి, కమిషనర్లతో గ్రంథాలయ సెస్సులపై సమీక్ష జరుగుతుందని చెప్పారు. శాఖా గ్రంథా లయ అవసరాలపై నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠకుల అవస రాలకు అనుగుణంగా గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా గ్రంథా లయ సంస్థ నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ సునీత, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇవి ఇంతేనా!?

- రైతు సేవా కేంద్రాల్లో మూలకు కియోస్క్ యంత్రాలు
- వైసీపీ హయాంలో ఏర్పాటు.. రూ.3.75 కోట్ల ఖర్చు
- అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగం

సంగం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. రైతులకు నాణ్యమైన సేవలందిస్తామని చెప్పి రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రాయితీపై రైతులు కొనుగోలు చేసేందుకు వీలుగా వీటిలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు ఇప్పుడు మూలకు చేరాయి. వీటి వినియోగంపై అధికారులు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు.

• 561 సచివాలయాల్లో ఏర్పాటు

జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా 561 సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు, వ్యవసాయ సిబ్బంది సహకారంతో రైతులు తమకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను కియోస్క్ యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. మార్కెట్లో పంటల ధరలు, వాతావరణ మార్పులు తదితర విషయాలను రైతులు తెలుసుకునే సౌలభ్యమూ ఉంటుంది. కానీ, గత ప్రభుత్వం యంత్రాలను ఏర్పాటు చేసిందే తప్ప రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను మాత్రం అందుబాటులో ఉంచకపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

• రూ.3.75 కోట్ల ఖర్చు

వైసీపీ హయాంలో కియోస్క్ యంత్రాలను కొనుగోలు చేసి అన్ని ఆర్బీకేల్లో ఏర్పాటు చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో రైతులకు ఈ యంత్రాలపై అవగాహన కల్పించకపోవడంతో వీటిని వినియోగించలేకపోయారు. ఒక్కో యంత్రానికి సుమారు రూ.67 వేలు వంతున 561 కియోస్క్ యంత్రాలకు రూ.3.75 కోట్లు ఖర్చు చేశారు. అందులో భాగంగా సంగం మండలంలోని 13 ఆర్బీకేలకుగాను 12 ఆర్బీకేలకు సరఫరా చేశారు. కొన్ని కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వీటిని పంచాయతీ కార్యాలయాల్లో ఉంచారు. చాలా కేంద్రాల్లో యంత్రాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో అవి కాస్తా మూలకు చేరాయి. ఇంకొన్ని చోట్ల వ్యవసాయ, పశుసంవర్థక, ఉద్యానశాఖ అధికారులు, సహాయకులు వారి ఫోన్లలో వైఫై ద్వారా ప్రారంభంలో యంత్రాలను వినియోగించారు. ఆ తరువాత రెండేళ్లుగా వాటిని పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కియోస్క్ యంత్రాలను వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.



సంగం పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రాలు

కీలక పోస్టులకు ఇన్‌చార్జులే దిక్కు!

- విద్యాశాఖలో ఖాళీగా ముఖ్య స్థానాలు
- అంతంత మాత్రంగా పర్యవేక్షణ
- విద్యా రంగ ఉన్నతిపై తీవ్ర ప్రభావం

బడిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన కొరవడింది. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం పనిభారంతో కునారిల్లుతోంది. పాఠాలు బోధించాల్సిన గురువులు నిత్యం పలు రకాల నివేదికల సమర్పణలో సతమతం అవుతుంటే అదనపు బాధ్యతల ఒత్తిళ్లలో పర్యవేక్షణాధికారులు ఉంటున్నారు. కీలకమైన నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు డిప్యూటీ డీఈఓలుగా ఎంఈఓలే ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఎంఈఓలను రెండు విభాగాలుగా చేసి ఎంఈఓ-1, ఎంఈఓ-2లు నియమించారు. ఎంఈఓ-1 టీచర్ల జీతాలు, ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, నిర్వహణ, విద్యా పరమైన అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఎంఈఓ-2 ప్రభుత్వ పథకాలు అయిన తల్లికివందనం, మనబడి నాడు నేడు, మధ్యాహ్న భోజన తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఎంఈఓ-2లు రెగ్యులర్‌గా పనిచేస్తుండగా, ఎంఈఓ-1లు మాత్రం జిల్లావ్యాప్తంగా ఉన్న 38 మండలాల్లో 20 మంది ఎఫ్ఏసీలుగా వ్యవహరిస్తున్నారు.

- వివరాలు 8లో..

'సోమశిల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. శుక్రవారం 2,603 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.800 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 3,750 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



పీ-4 ద్వారా పేద కుటుంబాల్లో వెలుగులు

కలిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పీ-4 ద్వారా బంగారుకుటుంబాల భవిష్యత్ కోసం మండలంలోని తూర్పుగుడ్లదొన సచివాలయంలో శుక్రవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. తూర్పు గుడ్లదొన, పడమర గుడ్లదొన, ఎరుకులరెడ్డిపాలెం గ్రామపంచాయతీలలో గుర్తించిన 155 బంగారుకుటుంబాల జాబితాను అధికారులు గ్రామస్థుల సమక్షంలో సమీక్షించారు. స్థానిక టీడీపీ నాయకుడు పట్నం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి సెంటు భూమి లేని నిరుపేద కుటుంబాలను ఉన్నతస్థితిలోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఆశయమని, ముఖ్యమంత్రి చంద్రబాబు మానసపుత్రిక పీ-4 కార్యక్రమం నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చి వారి జీవితాల్లో వెలుగులు నింపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకులరెడ్డిపాలెం గ్రామ సర్పంచు మేకల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పోకూరి సురేష్, ఏగూరి ప్రియాంక, రామాల హరితారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

● మండల సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల్లో కొందరు అశ్రద్ధగా పనిచేస్తున్నారని, అలాంటి వారు తమ విధానాలను మార్చుకొని ప్రజల పట్ల అంకితభావంతో పనిచేయాన్నారు. ప్రతి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలని సూచించారు. పోట్లూరులో సక్రమంగా సైడుకాలువలు, ఇంకుడు గుంతలు లేక అపరిశుభ్రంగా ఉంటే అక్కడి సచివాలయ సిబ్బంది ఏం చేస్తున్నారని ఆగ్రహించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను వేగవంతగా పూర్తి చేయాలన్నారు. వైద్యాధికారులు ఆసుపత్రికే పరిమితం కాకుండా గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు పెట్టి ప్రజలకు వైద్యసదుపాయాలపై అవగాహన కల్పించాని ఎమ్మెల్యే సూచించారు. తమ గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదని, కరెంట్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చేవూరు సర్పంచు శెట్టిపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రత్యేకించి చేవూరులో కరెంట్ సమ్యలు అనేకం ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. వీరేపల్లి నుంచి పాజర్ల మీదిగా పోట్లూరు వరకు వచ్చే ఆర్టీసీ బస్సు, ప్రస్తుతం రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాజర్ల సర్పంచు పాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల పాజర్లకు నూతనంగా వేసిన తారురోడ్డు ఒక కిలో మీటర్ మేర పనులు ఆగిపోయాయని, దీంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, ఆపనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. హౌసింగ్ ఏఈ గౌస్‌బాషా మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు పక్కాగృహాల జాబితా కూడా తయారు చేశామని, అప్పట్లో పెండింగ్ ఉన్న వారికి కూడా నగదు ప్రభుత్వం నుంచే అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరావు, ఎంఈవో గోవర్ధన్, పశువైద్యాధికారి మహ్మద్ అలీ, వైద్యఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయిప్రియాంక, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

డయల్-112తో తక్షణ సహాయం

కావలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో పోలీస్ సత్వర సహాయం కోరుకునే పౌరులు 112కు డయల్ చేయాలని కావలి రూరల్ సీఐ జీ.రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, 112 కాల్స్ అత్యవసర సేవల కోసం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పట్టణంలోని 1వ, 2వ, రూరల్ పోలీస్ స్టేషన్‌లకు 3 బైకులు కేటాయించారన్నారు. ఈ బైకులపై 2 రోజులుగా పోలీసులు పట్టణంలో సైరన్‌లతో చెక్కర్లు కొడుతూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నారన్నారు.

535 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 634 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 535 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-73, ఆర్ఆర్-4, సీఆర్-17, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 99బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.205.78గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

సమష్టిగా పని చేద్దాం : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గదుమాటి వెంకట కృష్ణారెడ్డి

అల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తల్లో ఉన్న భేదాభిప్రాయాలను వీడి అందరం కలసికట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి మానసపుత్రిక సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. అల్లూరు డీఎస్ఆర్ ట్రస్ట్ వేడుక మందిరంలో శుక్రవారం రాత్రి మండల నాయకులు, కార్యకర్తలతో కలసి సుపరిపాలనలో తొలిఅడుగుపై ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను, నాయకుడిని టీడీపీ అధిష్ఠానం గుర్తించి వారికి న్యాయం చేస్తుందని, ఎవ్వరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలకు పెద్దపీట వేయబోతోందన్నారు. ఇప్పటి వరకు జరిగగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను సైతం ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకు తగ్గట్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి , కృష్ణచైతన్య, పోలిశెట్టి, నీలప రెడ్డి హరీష్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా నిలవాలి

● డీఎస్పీ శ్రీధర్‌ను సత్కరించిన రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు


డీఎస్పీ శ్రీధర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు

కావలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలవాలని డీఎస్పీ వీ.శ్రీధర్‌ను రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కోరారు. శుక్రవారం వారు డీఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి ఇప్పటి వరకు కావలి సబ్‌డివిజన్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తకేంద్రానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను సత్కరించి మెమొంటో అందజేశారు. గత ఆరు నెలలుగా తలసేమియా డేకేర్ సెంటర్ చిన్నారులకు అందచేస్తున్న సేవలను గురించి మెడికల్ ఆఫీసర్ పాములూరు శ్రీధర్ వివరించారు. ప్రతి చిన్నారికి రెండు లేదా మూడు వారాలకు ఒకసారి ఉచితంగా రక్తం ఎక్కించడంతో పాటు మందులు, పౌష్టికాహారంను దాతల సహకారంతో అందిస్తున్నామని చెప్పారు. అలాగే పట్టణంలోని పలువురు వైద్యులు చిన్నారులకు అవసరమైన స్కాన్‌లు, ఇతర పరీక్షలను ఉచితంగా చేస్తున్నారన్నారు. తాము నిర్వహిస్తున్న తలసేమియా డేకేర్ సెంటర్‌ను సందర్శించాలని కోరారు. దీనిపై స్పందించి డీఎస్పీ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న రెడ్‌క్రాస్‌కు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్‌ఛైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, జనిగర్ల మనోహర్, గొట్టిపాటి మనోరమ, డేకేర్ సెంటర్ సబ్‌కమిటీ సభ్యులు కల్లయ్య పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టత, మున్సిపల్ ఎన్నికలపై సమాలోచనలు


మాట్లాడుతున్న బీజేపీ నేత భరత్‌కుమార్

కావలి(టౌన్), జూలై 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీజేపీని క్షేత్రస్థాయిలో పటిష్ఠ పరిచి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై శుక్రవారం నేతలు సమాలోచనలు చేశారు. పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు సమావేశమై మున్సిపల్ ఎన్నికల్లో కూటమి భాగస్వామ్యంలో పార్టీకి ఎన్ని కౌన్సిలర్ సీట్లు అడగాలి, ఏ వార్డులు కోరుకోవాలి, ఆయా ప్రాంతాల్లో పోటీ చేసేందుకు సమర్థవంతమైన నాయకులెవరున్నారు, పోటీకి ఆసక్తికనబరిచే నేతలు తదితర విషయాలపై చర్చించారు. ఈనెల 27న జరిగే మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు సీవీసీ సత్యం, బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, అమరా సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దగదర్తి(బిట్రగుంట), జూలై 18(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సిద్ధారెడ్డిపాలెంకు చెందిన భుక్య జనార్దన్‌నాయక్(35) ప్రమాదవశాత్తు గాయపడి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ జంపాని కుమార్ కథనం మేరకు.. జనార్దన్ తన స్వగ్రామంలో గురువారం మోటర్ సైకిల్‌పై వెళుతుండగా వీధి కుక్క అడ్డంగా రాగా దానిని తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లగా చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

ఏఎంసీకి తొలి మహిళా ఛైర్‌పర్సన్‌గా అలేఖ్య



కావలి, జూలై 18(ఆంధ్రజ్యోతి) : కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య నియమితులు రికార్డు సాధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎంతో మంది ఏఎంసీ ఛైర్మన్లుగా పనిచేసినా వారంతా పురుషులే. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏఎంసీ ఛైర్మన్లకు కూడా మహిళా రిజర్వేషన్ కల్పించడంతో మహిళా కోటా కింద అలేఖ్యకు పదవి దక్కింది. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అలేఖ్య పేరును ఛైర్మన్ పదవికి ప్రతిపాదించగా ప్రభుత్వం ఆమోదించింది. అయితే గతంలో అలేఖ్య తండ్రి గ్రంధి యానాదిశెట్టి కూడా తొలుత కావలి మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసి తర్వాత కావలి ఏఎంసీ ఛైర్మన్‌గా పని చేశారు. అలాగే ఆయన తనయ పోతుగంటి అలేఖ్య కూడా తొలుత మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా పనిచేసి ప్రస్తుతం ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. తండ్రి తనయలు అదే పదవులు వరుసగా చేయడం చూస్తే వారసత్వ హక్కులుగా పదవులు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఏఎంసీ ఛైర్మన్లుగా పనిచేసిన వారు ఎవరు కూడా ఆతర్వాత రాజకీయంగా పెద్దగా ఎదిగిన దాఖలాలు లేవు. పిన్న వయస్సులోనే ఛైర్మన్ పదవి పొందిన అలేఖ్య పాత సెంటిమెంట్‌ను అతిక్రమించి రాజకీయంగా ఎదుగుతోందని భావిద్దాం. కాగా ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన అలేఖ్యకు టీడీపీ నేతలతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు శుక్రవారం ఆమె నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. అలాగే తనకు పదవి రావడానికి కృషి చేసిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని అలేఖ్య కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏరియా ఆసుపత్రికి సామగ్రి వితరణ


ఆసుపత్రికి వీల్‌ఛైర్లు, స్ట్రక్చర్లు అందజేస్తున్న దాతలు

కందుకూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రికిలో రోగుల అవసరాల నిమిత్తం బడేవారిపాలెం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఉన్నం నిషికిల్ చౌదరి రూ.60వేలు విలువజేసే 4 వీల్‌ఛైర్లు, 2 స్ట్రక్చర్లు, 14 సెలైన్‌స్టాండ్లు, నాలుగు బీపీ ఆపరేట్ పరికరాలను వితరణ చేశారు. శుక్రవారం వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతలకు అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన తండ్రి ఉన్నం శ్రీనివాసులు జ్ఞాపకార్థం నిషికల్‌చౌదరి వీటిని అందజేశారు. సుపత్రికి వచ్చే రోగులు కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించి తన సోదరుడు, టీడీపీ నాయకుడు గొట్టిపాటి హరికృష్ణ సూచనతో వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటరెడ్డి, వెంకటనరసమ్మ, సిబ్బంది సుజాత, రాజేష్, చిట్టిబాబు, ప్రమీల, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సమస్త జీవకోటికి ప్రాణాధారం


మొక్క నాటుతున్న సీఐ వెంకటనారాయణ, తదితరులు

కలిగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాని రక్షించడంతోపాటు సమస్త జీవకోటికి ప్రాణాధారమన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏ శ్రీను, ఎంఈవో సురేష్, ఎస్ఎంసీ ఛైర్మన్ వీ కొండారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సేవాసంస్థ సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

వలేటివారిపాలెం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చుండిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాలకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, నాయకులు కామినేని వీరయ్య, కామినేని అశోక్, చెరువుపల్లి సాంబశివరావు, చొప్పర రామవులు, మేకల అశోక్, చొప్పర చినబ్రహ్మయ్య తదితరు లు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయాలి


చేతి పంపునకు మరమ్మతులు చేయిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతిపంపులు గుర్తించి తక్షణం మరమ్మతులు చేయించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది చర్యలు తీసుకోవాల ని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం సాయంత్రం లింగసముద్రంలో మరమ్మతులకు గురైన చేతిపంపును ఆయన దగ్గరుండి బాగు చేయించారు. చేతిపంపులు చెడి పోయినప్పుడు ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

కావలి(టౌన్), జూలై 18(ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం నిర్మాణానికి అమరావతిలో 6.8 ఎకరాల భూమిని కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ నాయకత్వంలో తాము గతంలో చంద్రబాబును కలిసి శ్రీరాములు స్మారక భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని విన్నవించామన్నారు. ఆయన ఆదేశాలతో భూమి పత్రాలను మంత్రి పీ నారాయణ చేతులమీదుగా దూండి రాకేష్‌కు అందించారన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఆర్యవైశ్యుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆర్యవైశ్యులకు పూర్తిస్థాయిలో అండదండలందిస్తున్నారని, సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేక విలువ ఇస్తూ తమ సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఓ మోస్తరు వర్షం

బిట్రగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతీవ్రత తగ్గడమే కాకుండా మధ్యాహ్నం ఓమోస్తరు వర్షం కురిసింది. ఇటీవల తీవ్రమైన ఎండలకు విసిగివేసారిన ప్రజలకు వర్షం కురవడంతో కాస్త ఉపసమనం కలిగింది.

విద్యార్థినులకు గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రభాకర్‌రావు

బిట్రగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తిప్ప ఎస్ఐ ఎన్.ప్రభాకర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నడుచుకోవాల్సిన విధానంపై వివరించారు. ఎవరైనా అసభ్యంగా, ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే తల్లితండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఇరతరులతో అతిచనువు మంచిది కాదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ల వాడకంపై కాకుండా చదువుపై దృష్టి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకు ప్రాధాన్యత

(5వ పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సభలో తీర్మానం చేయాలని కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి కోరారు. ఈ తీర్మానాన్ని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీలు బలపరచగా, ఆమోదిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ అరుణమ్మ ప్రకటించారు.

● తల్లికి వందనంపై స్పెషల్ డ్రైవ్ : కలెక్టర్

'పాఠశాల స్థాయిలోనే విద్యార్థి వివరాలను యూడీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా తల్లికి వందనం పథకానికి అర్హత గుర్తిస్తున్నారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల వివరాలను ఎంట్రీ చేయడంలో ఆలస్యం చేస్తున్నట్లు గుర్తించాం. అటువంటి పాఠశాలలపై స్పెషల్ డ్రైవ్ పెడతాం. తల్లికి వందనం పథకానికి సంబంధించి జిల్లాలో 1500 వరకూ గ్రీవెన్స్ వచ్చాయి. వాటిని పరిశీలిస్తున్నాం.' అని కలెక్టర్ ఆనంద్ అన్నారు.

● పలు అంశాలపై ఎమ్మెల్యేల నిలదీత

ఇళ్లకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ మీటర్లతో ఎక్కువ బిల్లులు వస్తున్నాయని మునుపటితో పోలిస్తే 20 శాతం వరకూ ఎక్కువ యూనిట్లు వాడినట్లు వస్తోందని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. కొత్త మీటర్లు ఏర్పాటు సమయంలోనే కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలే నేటికీ ఉన్నాయని వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాని కోరారు. గత ప్రభుత్వంలో ఏఎంసీ నిధులతో చేపట్టిన రోడ్డు పనులు ఎంతవరకు వచ్చాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం వివరాలను కూడా సభ ముందు ఉంచితే బాగుండేదని సూచించారు. చిల్లకూరు మండలం పొన్నపువారిపాలెం రోడ్డుకు అటవీ అనుమతులు వచ్చాయని, త్వరగా ఎస్టిమేషన్లు వేసి పంపాలని పీఆర్ అధికారులను ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి కోరారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. డీపీఆర్‌సీ భవనాల నిర్మాణానికి నాలుగు నెలల క్రితం అనుమతులిస్తే ఇంతవరకూ ఎందుకు టెండర్లు పిలవలేదని ఛైర్‌పర్సన్ పంచాయతీ రాజ్ అధికారులను ప్రశ్నించారు. సౌత్‌మోపూరు హైస్కూల్ ప్రహరీ శంకుస్థాపన సమయంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా వెంగమాంబ ఉత్సవాలలో అధికారులు తమను గౌరవించకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించారని దుత్తలూరు జడ్పీటీసీ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆనం.. వెంటనే ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థికి బ్యాగు అందజేస్తున్న సబ్ కలెక్టరు శ్రీపూజ

కందుకూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలోని 57 మంది నిరుపేద విద్యార్థులకు వరల్డ్‌విజన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక పద్మావతి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ పదవ తరగతికి వచ్చే సమయానికే విద్యార్థులు తమ లక్ష్యం పట్ల స్పష్టత కలిగి ఉండటం ద్వారా సాధించవచ్చునని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్‌విజన్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

లింగసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకం నుంచి అధికారులు శుక్రవారం సాయంత్రం మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. గత బుధవారం నుంచి ఈ పథకంకు చెందిన ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంటును సిబ్బంది శుభ్రం చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేశారు. దీంతో మూడు రోజుల నుంచి ఇబ్బందులు పడ్డ ప్రజలు, మంచినీటి సరఫరా పునరుద్ధరణతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బిట్రగుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో చెన్నైకి చెందిన ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ పెంచలరావుచే ఉచిత ఆయుర్వేద, మర్మకళ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బాలాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో మైగ్రెన్, సైనసైటిస్, మెడ, భుజాలు, వెన్నుముఖ, నడు ము ఇతర నొప్పులకు ఆయుర్వేద వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు విద్యా ఉపకరణాల పంపిణీ

కావలి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పట్టణంలోని సెవెన్‌లైన్స్ సభ్యులు నోట్‌పుస్తకాలు, పలకలు, జామెంటీ బ్రాక్స్‌లు తదితర విద్యా ఉపకరణాలు, తినుబండారాలు పంపిణీ చేశారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు శానం కృష్ణ, మధుసూదనరావులు సూచనల మేరకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎక్కువగా ఉండే ఆ పాఠశాలకు విద్యా ఉపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెవెన్‌లైన్స్ సభ్యులు గాదంశెట్టి వేణుగోపాల్, పాదర్తి నాగరాజు, పెసల పవన్, సువర్ణ శ్రీనివాసులు, పేరూరు శంకర్, పెట్టుగాని రమేష్, రాజా సుబ్బారావు, శేగు రంగం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


నడిమిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యా ఉపకరణాలతో విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

● రూ.8.32 కోట్ల ఎరువులు, పురుగు మందుల సీజ్

నెల్లూరు(వ్యవసాయం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. దాదాపుగా రూ.8.32 కోట్ల విలువైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సీజ్ చేశారు. రాష్ట్ర విజిలెన్స్ బృందం జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా పలు దుకాణాలను తనిఖీ చేసింది. నెల్లూరు, పొదలకూరు, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, కందుకూరు గుడ్లూరు, కావలి ప్రాంతాల్లో రెండు విత్తనాల దుకాణాలు, 12 ఎరువుల దుకాణాలు, 14 పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసింది. రికార్డులు నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పురుగు మందుల కంపెనీలకు సంబంధించిన పత్రాలను రెన్యువల్ చేయకుండా అమ్మకాలు సాగించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని



పురుగు మందుల దుకాణాల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రూ.8.32కోట్ల విలువ చేసే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సీజ్ చేసింది. ఈ తనిఖీల్లో వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్, ఒంగోలు విజిలెన్స్ సీఐ ఎన్ రాఘవరావు, నెల్లూరు ఏడీఏ నర్సోజీరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆరోగ్య అధికారిగా కనకాద్రి

నెల్లూరు(సిటీ), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి (ఎంహెచ్‌వో)గా డాక్టర్ కనకాద్రిని నియమిస్తూ పురపాలక శాఖ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. ఆయన ప్రస్తుతం కేంద్ర కారాగారంలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ప్రస్తుత ఎంహెచ్‌వో చైతన్యకు ఏడాది డిప్యుటేషన్ గడువు ముగియడంతో ఆయన తిరిగి వైద్య, ఆరోగ్య శాఖలో రిపోర్టు చేయనున్నారు. డాక్టర్ కనకాద్రి ఎంహెచ్‌వోగా ఎప్పుడు బాధ్యతలు స్వీకరిస్తారో తెలియాల్సి ఉంది.

కడుపు నింపిన నేస్తమా...

నీకిదే.. కన్నీటి వీడ్కోలు!

● యజమాని అంతిమయాత్రలో పాల్గొన్న శునకం

పొదలకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మనిషి చనిపోయిన తరువాత తలకొరివి పెట్టేవాడు కొడుకు.. పాడి మోసేవాళ్లు ఆప్తులు.. కాటిదాకా వచ్చే వాళ్లే బంధుమిత్రులు. అయితే కొన్ని సందర్భాల్లో మూగ నేస్తాలు కూడా కాటిదాకా వస్తుంటాయి. కానరాని లోకాలకు చేరుకున్న తన యజమాని కోసం దీనంగా కన్నీరు పెడతాయి. వాటినెవరూ ఓదార్చలేరు. విశ్వాసానికి మారుపేరైన ఓ శునకం కూడా తన యజమాని అంత్యక్రియల్లో పాల్గొని 'స్వామి' భక్తిని చాటుకుంది. పొదలకూరు పట్టణంలోని మెయిన్ రోడ్డులో నివసిస్తున్న కాసా చలపతి అనే వ్యక్తి శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. ఆ విషయం ఆ శునకానికి తెలిసిందో.. ఏమో రోజూ తనకు ఆహారం పెట్టి, బాగోగులు చూసే యజమాని మరణించడంతో దిగులు పడిపోయింది. బాధతో శ్మశానం వరకు వచ్చింది. ఆ శునకం మూగ వేదన తెలియని వారు.. దారిలో అడ్డం వస్తోందని



యజమాని అంత్యక్రియల వద్ద నిరీక్షిస్తున్న శునకం

తరిమేస్తున్నా.. కాటివరకు అందరితోపాటు అంతిమయాత్రలో పాల్గొన్నది. గోతి తవ్వి చలపతి మృతదేహాన్ని పూడ్చి పెట్టే వరకూ చూస్తూ ఉండిపోయింది. అంత్యక్రియలు పూర్తయ్యాక.. అందరితో పాటే అక్కడి నుంచి వెనుదిరిగింది. ఈ దృశ్యం చూసి స్థానికుల గుండెలు బాధతో బరువెక్కిపోయాయి.

వ్యాధుల వర్రీ!

● ఎడగారు వరిలో ఆకుముడత..

● రసం పీల్చే ఆకునల్లితో పంట నష్టం

● కంకినల్లితో తాలు గింజలు

● జాగ్రత్తలు అవసరం

● కేవీకే శాస్త్రవేత్త లోకేష్‌బాబు



నెల్లూరు రూరల్ మండలంలో సాగవుతున్న వరి పైరు



ఆకుముడత కలుగజేసే గొంగళిపురుగు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడగారు (ముందస్తు ఖరీఫ్) సీజన్‌లో సాగవుతున్న వరి పంటకు వ్యాధుల బెడద ఎక్కువగా ఉంది. ఆకుముడత ఆకుముడత కలుగజేసే గొంగళి పురుగుతో, పెద్దనల్లి పురుగులు ఆకు అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చి పంటను దెబ్బతీసే ప్రమాదం ఉంది. దీంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీనిపై కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ లోకేష్‌బాబు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

● ఆకుముడతతో తెల్లగా....

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల ఆకులు తెల్లబడిపోతాయి. దీంతో పోటాకు దశలో పంటకు నష్టం ఎక్కువగా ఉంటుంది. దుబ్బకి లార్వా లేకపోతే పురుగులు సోకిన ఆకులు ఉండడం వల్ల పంట దెబ్బ తింటుంది. వీటిని గుర్తిస్తే పిలకదశలో క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 2.5మిల్లీ లీటర్లు, లేదంటే క్లోరాంట్రనిలిప్రోల్ 20 ఎస్‌సీ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అదేవిధంగా చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2గ్రాములు లేదంటే ఎసిఫేట్ 75 యస్.సి 1.5 గ్రాములు లేదంటే క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 యస్.సి 0.3 మిల్లీ లీటర్లుల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● రసాన్ని పీల్చే ఆకునల్లి..

ఆకునల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన ఆశించి రసాన్ని పీల్చి వేయడం వల్ల ఆకులు ఎండిపోయినట్లుగా కనిపిస్తాయి. బెట్ట పరిస్థితుల్లో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు నీటిలో కరిగే గంధకపు పొడి 50శాతం 3గ్రాములు లేదంటే ప్రొఫెనోఫాస్ 50ఇ.సి 2మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● కంకినల్లితో తాలుగింజలు..

కంటికి కనిపించని సూక్ష్మ సాలీడు వర్గానికి చెందిన పురుగులను కంకి నల్లి(నల్లకంకి) అంటారు. ఇవి ఆశించినప్పుడు ఆకులపై పుసుపు రంగు చారలు ఏర్పడి క్రమేణా ఆకు తొడిమల లోపల, అదేవిధంగా ఆకు ఈనెలపై, ఆకు తొడిమలపై నల్లని మచ్చలు ఏర్పడతాయి. గింజలపై నల్లని మచ్చలు మచ్చలు ఏర్పడి పాలుపోసుకోక తాలు గింజలుగా అవుతాయి. కంకినల్లి పురుగు లక్షణాలు గుర్తించిన వెంటనే 15రోజుల వ్యవధిలో రెండుసార్లు ప్రొఫెనోఫాస్ 20ఇ.సి 2మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదంటే స్పైరోమెసిఫెన్ 240ఎస్.సి 1మిల్లీ లీటరు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రూరల్లో వణికిస్తున్న 'మైట్'

అక్కడక్కడ మెంపిప్పితో గుబులు

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఈ ఎడగారు సీజన్‌లో నెల్లూరు రూరల్ మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగంతో మైట్ (నల్లిపురుగు) వ్యాధి పంటను ఆశించింది. నల్లిపురుగు అంతటా సోకడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యాధితో వరి ఆకులు పసుపుగా మారి పంట బలహీనమవుతుంది. మరోపక్క మెంపిప్పి (కాండం తొలుచు పురుగు) అక్కడక్కడ సోకుతుండటం రైతులను మరింత వేధిస్తోంది. ఈ రెండు వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించి వరికి ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ఊరూరా పొలం పిలుస్తోంది పేరిట సదస్సులు నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయా ధికారి ఎస్వీ నాగమోహన్ తెలిపారు.



రైతులకు సూచనలిస్తున్న కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త లోకేష్‌బాబు

రేపు కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ది కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యూత్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్న ట్లు అసోసియేషన్ కార్యదర్శి జీ సతీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాల న్నారు. ఎంపికైన వారు కాకినాడ లో ఈనెల 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహిస్తారని తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల గడువు పునరుద్ధరణ

నెల్లూరు (విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు మరో ఏడాది గడువును పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో 30-4-2025 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు పూర్తి వివరాలతో అర్హత ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతపరిచి ఆయా కళాశా లల్లోని ప్రిన్సిపాళ్లకు ఈనెల 21వ తేదీలోపు అందజేయాలన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ ధర్నా

నెల్లూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తయినా సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కేవలం కాగితాలకే పరిమితమవడంతో విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు పై చదువులకు, ఉద్యోగాలకు వెళ్లేందుకు సర్టిఫికెట్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థులకు ఉన్నత చదువును దూరం చేసే జీవో నెం 77ను రద్దు చేసి, ఫీజు బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివం వర్మ, అబ్దుల్, జీవన్‌సాయి, కోటి, జాహ్నవ్, ఆకాష్, ఇమ్రాన్, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

దగదర్తి(బిట్రగుంట), జూలై 18 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం సున్నంబట్టి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ పన్నీర్‌సెల్వం (56) మృతి చెందాడు. ఎస్‌ఐ జంపాని కుమార్ కథనం మేరకు.. చెన్నైకి చెందిన పన్నీర్ సెల్వం ఈనెల 16వ తేదీన హైదరాబాద్ నుంచి లారీలో ఆటో స్పేర్‌పార్ట్స్ లోడుతో బయలుదేరాడు. గురువారం రాత్రి దగదర్తి మండల పరిధిలోని సున్నంబట్టి గ్రామ సమీపంలో నిద్రమత్తులో ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువలో వృద్ధుడి మృతదేహం

దగదర్తి(బిట్రగుంట), జూలై 18(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం మొబ్బుగుంటపాలెం వద్ద ఉన్న కాలువలో శుక్రవారం మధ్యాహ్నం ఓ వృద్ధుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్‌ఐ జంపాని కుమార్ కథనం మేరకు.. సంగం మండలం తరుణవాయికి చెందిన తిరుపతయ్య (75) గురువారం మధ్యాహ్నం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆయన కోసం గాలించిన కుటుంబ సభ్యులు ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం కావడంతో సంగం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆ మృతదేహం తిరుపతయ్యదిగా ఆయన కుమారుడు రత్తయ్య గుర్తించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి నెలా మూడో శుక్రవారం

ఉద్యోగుల గ్రీవెన్స్‌డే

● సద్వినియోగం చేసుకోవాలి : జేసీ కార్తీక్



ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, దీనిని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఉద్యోగుల కోసం మొట్టమొదటి గ్రీవెన్స్ డే కార్యక్రమం జరిగింది. ఉద్యోగుల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్య, సచివాలయ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖల ఉద్యోగులు వినతిపత్రాలిచ్చారు. ప్రధానంగా బదిలీలకు సంబంధించి వినతులు ఎక్కువగా వచ్చాయి. జేసీ మాట్లాడుతూ 124 మంది ఉద్యోగులు అర్జీలిచ్చారని, కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ ఏవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత గ్రేజింగ్ భూముల్లో దుక్కులు

● వర్షాలు పడుతుండటంతో పంటల సాగుకు సన్నాహాలు

● గతంలో ఆక్రమణలు తొలగించాలని హెచ్చరించిన అధికారులు

● పట్టించుకోని ఆక్రమణదారులు

లింగసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రారెడ్డిపాలెం పంచాయతీ వెంగళాపురంలోని సర్వే నెంబర్లు 155/-1, 2లోని పంచాయతీ గ్రేజింగ్ (మేత పోరంబోకు) భూముల్లో కొందరు ఆక్రమణదారులు పంటల సాగుకు సన్నాహాలు ప్రారంభించారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో భూములు పదునెక్కడంతో దుక్కులు దున్నడం ప్రారంభించారు. ఈ సర్వే నెంబర్లలో సుమారు 155 ఎకరాల భూములు ఉండగా కొన్ని భూములను వెంగళాపురం గ్రామానికి చెందిన కొందరు ఏళ్ల తరబడి ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. మరికొందరు ఆక్రమించిన భూములను తిమ్మారెడ్డిపాలెం, ఎర్రారెడ్డిపాలెం, వలేటివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులకు కౌలుకు ఇస్తూ అక్రమంగా ధనార్జనకు పాల్పడుతున్నారు. దీంతో సుమారు నాలుగైదు నెలల క్రితం రెవెన్యూ అధికారులు ఈ భూములను పరిశీలించి, సుమారు 80 ఎకరాలు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక ఆక్రమించిన భూముల్లో బోర్లు వేసి, వాటికి విద్యుత్ కలెక్షన్లు కూడా తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో రెవెన్యూ అధికారులు మరోసారి ఈ భూముల్లో పంటలు సాగు చేయవద్దని హెచ్చరించడంతోపాటు తక్షణం ఆక్రమణదారులు భూములను ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇదేమీ పట్టించుకోని ఆక్రమణదారులు గత వారం రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో మళ్లీ పంటలు సాగు చేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వెంగళాపురం పంచాయతీలోని ఆక్రమిత భూముల్లో పంటల సాగుకు దుక్కులు దున్నిన దృశ్యం

గుర్తుతెలియని వాహనం ఢీకొని

వృద్ధురాలి మృతి

కావలిరూరల్, (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని కందిపాటి శేషమ్మ(84) మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని గౌరవరం సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గౌరవరం ఎస్సీ కాలనీకి చెందిన శేషమ్మ ఒంగోలులోని బంధువుల ఇంట జరిగే ఓ కార్యక్రమానికి వెళ్లేందుకు తెల్లవారుజామున గ్రామం నుంచి ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలోని బోగోలు మండలం సాంబశివపురం సమీపంలో మరికొందరి బంధువుల కోసం ఆటో దిగింది. ఆ రోడ్డులో బంధువులు లేకపోవడంతో అక్కడ నుంచి కావలికి వెళ్లేందుకు ఆటో కోసం జాతీయ రహదారి దాటుతుండగా ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. హైవే మొబైల్ సిబ్బంది గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి పళ్లు, మెడలో దారం ఆధారంగా మహిళగా గుర్తించి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో గౌరవరంకు చెందిన శేషమ్మ గ్రామంలో లేకపో వడం, రైలు వద్దకు వెళ్లకపోవడంతో మృతి చెందినది శేషమ్మగా గుర్తించామని సీఐ రాజేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కీలక పోస్టులకు ఇన్‌చార్జులే దిక్కు!

విద్యాశాఖలో ఖాళీగా ముఖ్య స్థానాలు

అంతంత మాత్రంగా పర్యవేక్షణ

విద్యారంగ ఉన్నతిపై తీవ్ర ప్రభావం

నెల్లూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యాశాఖలో తాత్కాలిక బాధ్యతలతో నెట్టుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌళిక సదుపాయాలు, ఇతరత్రా సమస్యలపై పర్యవేక్షణ చేయాల్సిన మండల విద్యాశాఖాధికారులు అత్యధిక ప్రాంతాల్లో ఇన్‌చార్జులే వ్యవహరిస్తున్నారు. శాఖాపరమైన కార్యక్రమాల పర్యవేక్షణ, జిల్లా కేంద్రంలో సమావేశాలు, సమాచార మార్పిడి పనులకు ఎక్కువ సమయం కేటాయించడానికే ఈ పోస్టుల సమయం సరిపోతుందన్న విమర్శలూ ఉన్నాయి. డీఈఓ స్థానం తర్వాత ఉప విద్యాధికారుల స్థానాలు మొత్తం నాలుగు ఉండగా వీటిలో నలుగురూ ఇన్‌చార్జులతో కాలం వెల్లదీస్తున్నారు. జిల్లాలో 38 మండలాల్లో ఎంఈఓ-1లు 18 మండలాల్లో రెగ్యులర్‌గా ఉండగా 20 మండలాల్లో మాత్రం ఇన్‌చార్జులు పనిచేస్తున్నారు. వీరిలో కూడా రెగ్యులర్ ఎంఈఓ-1లు ఇతర ప్రాంతాల్లో కూడా ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తుండటం విశేషం. నెల్లూరు అర్బన్ ఎంఈఓ-1 రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తూ నెల్లూరు రూరల్ ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎంఈఓ-2కు సంబంధించి అన్ని మండలాల్లో రెగ్యులర్ ఎంఈఓలు ఉండగా ఒక్క సీతారామపురానికి మాత్రం ఎవరినీ నియమించలేదు.

● అన్ని వసతులున్న చోట మాత్రమే రెగ్యులర్

జిల్లాలో 18 మంది రెగ్యులర్ ఎంఈఓ-1లు అన్ని వసతులు కలిగి, నగరానికి సమీప మండలాలు, రోడ్డు సర్వీస్ ఉన్న మండలాల్లో మాత్రమే రెగ్యులర్‌గా పని చేస్తున్నారు. జిల్లాకు సుదూర ప్రాంతాలు, వసతులు లేని చోట మాత్రం ఎవరూ సుముఖత చూపకపోవడంతో 20 మండలాల్లో ఇన్‌చార్జులతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. విద్యారంగం ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నా శాఖాపరమైన ఇబ్బందులతో విద్యాశాఖ కునారిల్లుతోంది. సమగ్రశిక్ష, విద్యాశాఖ ఇచ్చే ఇతర కార్యక్రమాలను మండలాల్లో అమలు చేయాల్సిన బాధ్యత ఎంఈఓలదే. నిత్యం ఉన్నతాధికారులకు వారడిగిన సమాచారం నివేదికల రూపంలో పంపడంలో ఎంఈఓలు తలమునకలవుతున్నారు. ప్రతి సోమవారం స్పందన, వారంలో ఒకరోజు జిల్లాస్థాయి శాఖాపరమైన సమీక్ష, మరోరోజు ఉన్నతాధికారుల సమీక్ష, వీటికితోడు ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో ప్రొటోకాల్ హాజరు, నాడు-నేడు, విద్యాకానుక, మౌళిక వసతులు, మధ్యాహ్నభోజనం, హాజరు యాప్ పర్యవేక్షణ, తల్లిదండ్రుల కమిటీల ఎన్నికల నివేదికలు, మరికొద్దిరోజుల్లో తల్లికివందనం జాబితాలు తదితర కార్యక్రమాలతోనే సమయం సరిపోతుందని ఎంఈఓ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్ల నిర్వహణ, సెలవుల వివరాలు, వేతన బిల్లులపై సంతకాలు తదితర సాధారణ విధులకు సమయం ఉండడం లేదని మరో అధికారి పేర్కొన్నారు.



● విద్యార్థులపై తీవ్ర ప్రభావం

పాఠశాలల్లో నిర్వహించే అన్ని రకాల పరీక్షలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఫలితాల మెరుగుదలపై శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది. అయితే వీటిపై దృష్టి సారించే ఉప విద్యాశాఖాధికారులు ఇన్‌చార్జులుగా ఉండడంతో దీని ప్రభావం ఫలితాలపై పడుతోందని విద్యాశాఖ వర్గాలు చెపుతున్నాయి. నెల్లూరు, కందుకూరు, కావ లి డిప్యూటీ ఈఓలుగా కూడా ఎంఈఓలకే అదనపు బాధ్యతలు అందించి నెట్టుకొస్తున్నారు. దీంతో ఓ వైపు తమ రెగ్యులర్ పోస్టుకు సంబంధించి బాధ్యతలు నిర్వర్తిస్తూనే అదనంగా ఈ బాధ్యతలు కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు అన్ని పాఠశాలల్లోనూ సరిపడా ఉపాధ్యాయులూ లేకపోవడంతో సమస్య తీవ్రతను రెట్టింపు చేస్తోంది.

● పదోన్నతులు ఎప్పటికో!?

సర్వీస్‌రూల్స్ సమస్య ఒక కొలిక్కివస్తే ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్), బీఈడీ కళాశాలల్లో అధ్యాపకులుగా, ఎంఈఓలుగా, డిప్యూటీ ఈఓలుగా పదోన్నతులు దక్కనున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయమని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదంటున్నారు. అలాగే యాప్‌ల నమోదు పనిభారం తగ్గించి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులకు, పర్యవేక్షణ అధికారులకు వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు.